www.udyamakeratam.com

PRGI No. : TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 119 | 18-10-2026 | ఆదివారం | పేజీలు: 8 | వెల : రూ.2/-

## దాండియా సంబరాల్లో మృత్యుఘోష!



- వేడుకల వేళ విద్యార్థులపై కుప్పకూలిన భారీ లైటింగ్ స్టాండ్
- ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో తీవ్ర విషాదం
- వనపర్తి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని సోనీ దుర్మరణం
- మరో 25 మందికి గాయాలు.. ఐదుగురి పరిస్థితి విషమం
- ఈదురుగాలుల ధాటికి లైటింగ్ క్రేన్ కూలినట్లు ప్రాథమిక సమాచారం
- ఘటనపై సీఎం దిగ్భ్రాంతి.. సమగ్ర విచారణకు ఆదేశం

హైదరాబాద్‌లోని నాదర్‌గుల్ ప్రాంతంలో ఉన్న ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కాలేజీలో నిర్వహిస్తున్న 'సంగమం-2026' టెక్నికల్, కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన దాండియా వేడుకల్లో తీవ్ర విషాదం నిండింది. వేడుకల ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భారీ ఇనుప విద్యుత్ దీపాల స్టాండ్ ఒక్కసారిగా అక్కడ ఉన్న విద్యార్థులపై కుప్పకూలింది. ఈ ఘోర ప్రమాదంలో వనపర్తి జిల్లాకు చెందిన బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సోనీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఆమెతో పాటు మరో 25 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో మృతురాలి సోదరితో సహా ఐదుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం అందుతోంది. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన కళాశాల యాజమాన్యం, పోలీసులు బాధితులను ఎల్‌బీ నగర్‌లోని కామినేని ఆసుపత్రికి, ఆదిభట్లలోని ఇతర ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు.



వివరాలు 2లో..



## పండుగ పిలుపు
## పల్లెబాట పట్టిన పట్నం!

- దసరా వేళ సొంతూళ్లకు నగరవాసుల పరుగులు
- ప్రయాణికులతో కిక్కిరిసిన ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్లు
- రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులతో ఆర్టీసీ ఏర్పాట్లు
- నగర శివార్ల నుంచే జిల్లాలకు ప్రత్యేక సర్వీసులు
- మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం

వివరాలు 2వ పేజీలో

దసరా పండుగ నేపథ్యంలో భాగ్యనగరం నుంచి పల్లెలకు జనప్రవాహం మొదలైంది. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు కుటుంబ సభ్యులతో కలిసి సొంతూళ్లకు పయనమవుతున్నారు. దీంతో హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్), జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్)లో ఎటుచూసినా ప్రయాణికుల సందడే కనిపిస్తోంది. ప్లాట్‌ఫారాలు, నిరీక్షణ గదులు నిండిపోవడంతో రద్దీని నియంత్రించడం ఆర్టీసీ అధికారులకు సవాలుగా మారింది. రానున్న రోజుల్లో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు పటిష్టమైన ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పండుగ వేళ కుటుంబాలతో కలిసి ఊళ్లకు వెళ్లే మహిళలకు ఈ సదుపాయం ప్రయాణ ఖర్చులను భారీగా తగ్గిస్తోంది. ప్రజలందరూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా ఆర్టీసీ సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు.

*- హైదరాబాద్, అక్టోబర్ 17 (ఉద్యమ కెరటం)*

## నేడు ట్యాంక్‌బండ్‌పై పెద్ద బతుకమ్మ వేడుకలు

మహిళలంతా వేడుకల్లో పాల్గొనాలి

మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



2

## తెలంగాణలో తీవ్ర కరవు

- 315 మండలాల్లో కరవు ఛాయలు: తుమ్మల నాగేశ్వరరావు
- రాష్ట్రంలో 315 మండలాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నట్లు గుర్తింపు
- కేంద్రం తక్షణమే సాయం చేయాలని కోరిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రాష్ట్రవ్యాప్తంగా 23 శాతం వర్షపాత లోటు, 13 లక్షల ఎకరాల్లో తగ్గిన సాగు
- పంట నష్టపోయిన రైతులకు రూ.1,986 కోట్ల సహాయ ప్యాకేజీ ప్రతిపాదన
- ప్రమాదకరంగా పడిపోయిన జలాశయాల నీటిమట్టాలు

4



## సివిల్ సర్వీసెస్ అధికారుల హెరిటేజ్ వాక్

శిక్షణలో ఉన్న సుమారు 170 మంది సివిల్ సర్వీసెస్ అధికారుల కోసం పర్యాటక, వారసత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వారసత్వ పర్యటన శనివారం నిర్వహించారు.

3

## గోదావరి-కావేరి లింక్‌తో రాష్ట్రానికి మరణ శాసనం

- బాబు కుట్రకు మద్దతు పలుకుతున్న రేవంత్
- తెలంగాణ ద్రోహులు మళ్లీ నిద్ర లేచారు
- తెలంగాణ నోట్లో మట్టికొడుతున్న 'చెయ్యి'!
- కావేరి ముసుగులో తెలంగాణ గొంతు కోస్తున్న బాబు
- దేవాదులలో పది మోటర్లు ఎందుకు నడవలేదు?
- మీ నిర్వాకం వల్ల వరంగల్ జిల్లా కరువు పాలైంది
- బీజేపీ నాయకులు ఏం చేస్తున్నరు?
- ఇంతమంది ఎంపీలున్న ఈ ద్రోహాన్ని అడ్డుకోలేదు
- నిప్పులు చెరిగిన హరీష్ రావు

3





## ఆడబిడ్డల జీవితాల్లో ఆనందాల పూలవాన కురవాలి!

- ప్రజలకు సద్దుల బతుకమ్మ సీఎం శుభాకాంక్షలు
- ఆడబిడ్డల సంక్షేమమే అసలైన బతుకమ్మ స్ఫూర్తి: కేసీఆర్
- సమానత్వం, మహిళల ఐక్యతకు ప్రతీక: భట్టి విక్రమార్క

2



## మురికి టాయిలెట్ ఫొటో పెడితే వెయ్యి రివార్డు

- వాహనదారులకు ఎన్‌హెచ్ఏఐ బంపర్ ఆఫర్
- టోల్‌ప్లాజాల్లో అపరిశుభ్ర మరుగుదొడ్లను గుర్తిస్తే బహుమతి
- రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లో ఫొటో అప్‌లోడ్ చేస్తే చాలు
- ఫాస్టాగ్ రీఛార్జ్ రూపంలో రూ.వెయ్యి రివార్డు
- అక్టోబర్ 31 వరకు ప్రత్యేక కార్యక్రమం

4

## పిల్లలకూ ఇంటర్నెట్ వాడే హక్కు

ఆన్‌లైన్ భద్రత పేరుతో ఇంటర్నెట్‌కు దూరం చేయొద్దు

వయసుతో సంబంధం లేకుండా పిల్లలకూ డిజిటల్ ప్రపంచంలో భాగస్వామ్యం

భావప్రకటన స్వేచ్ఛలో ఇంటర్నెట్ వినియోగానికీ ప్రాధాన్యం

సామాజిక మాధ్యమ సంస్థల వైఫల్యాలకు పిల్లలను బాధ్యులను చేయలేం

పిల్లల భద్రతకు ప్రత్యేక చైల్డ్ మోడ్‌పై సుప్రీంకోర్టు సూచన

4



## నేటి నుంచి వర్ష సూచన

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ



2

## మూడు దశల్లో సమగ్ర భూ రీ సర్వే

- 285 గ్రామాల్లో సర్వే పూర్తి
- అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ
- రెవెన్యూ అధికారుల సమీక్షలో మంత్రి పొంగులేటి

3



## నిరసనల్లో లైంగిక వేధింపులా?



4

ఉద్యమ కెరటం
ఆదివారం 18 అక్టోబర్ 2026




# ఆడబిడ్డల జీవితాల్లో ఆనందాల పూలవాన కురవాలి!

**ప్రజలకు సద్దుల బతుకమ్మ సీఎం శుభాకాంక్షలు**

**ఆడబిడ్డల సంక్షేమమే అసలైన బతుకమ్మ స్ఫూర్తి: కేసీఆర్**

**సామాజిక న్యాయం, మహిళల ఐక్యతకు ప్రతీక: భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, అక్టోబర్ 17 (ఉద్యమ కెరటం):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ప్రత్యేకించి ఆడబిడ్డలకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. 9 రోజులపాటు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో నిర్వహించుకునే ఈ పండుగ తెలంగాణ సాంస్కృతిక వైభవానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రకృతి ఆరాధన, మహిళల ఐక్యత, సామాజిక సామరస్యం, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని అభివర్ణించారు. సద్దుల బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా ఆనందాలను నింపాలని, కుటుంబాల్లో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా ఆడబిడ్డలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. ప్రకృతిని, పూలను పూజించే అరుదైన సంస్కృతికి తెలంగాణ నెలవని తెలిపారు. ప్రకృతి పట్ల ఆరాధనాభావాన్ని, మహిళల ఐక్యతను, సాంస్కృతిక వారసత్వాన్ని ఈ పండుగ ప్రతిబింబిస్తుందని వివరించారు. బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా ఆనందాల పూలవాన కురిపించాలని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని, తెలంగాణ సంస్కృతి వైభవం తరతరాలపాటు నిలవాలని కోరుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సామాజిక న్యాయం, సమానత్వం, మహిళల ఐక్యతకు ప్రతిరూపమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ ముగింపు వేడుక అయిన సద్దుల బతుకమ్మ సందర్భంగా రాష్ట్ర ఆడబిడ్డలకు బీఆర్ఎస్ అధినేత, తొలి సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిది రోజులపాటు ఆడబిడ్డల ఆటపాటలతో సాగిన బతుకమ్మ సంబురాలు రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణాన్ని సృష్టించాయని పేర్కొన్నారు. తెలంగాణ మహిళల సాంస్కృతిక చైతన్యానికి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ గొప్ప ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. 'మల్లారావమ్మా బతుకమ్మా.. మా బతుకులు బాగు చేయవమ్మా' అని కోరుకుంటూ బతుకమ్మకు వీడ్కోలు పలికే సద్దుల బతుకమ్మ వేడుక తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెబుతుందని కేసీఆర్ పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం తెలంగాణ ప్రజల జీవన విధానంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని వివరించారు. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, వారి అభ్యున్నతికి కృషి చేసినప్పుడే బతుకమ్మ పండుగకు నిజమైన సార్థకత చేకూరుతుందని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని ఆడబిడ్డలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

# నేడు ట్యాంక్‌బండ్‌పై పెద్ద బతుకమ్మ వేడుకలు

**మహిళలంతా వేడుకల్లో పాల్గొనాలి**

**మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**



**హైదరాబాద్, అక్టోబర్ 17 (ఉద్యమ కెరటం) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుంటున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తెలిపారు. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆలోచనల మేరకు రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో బతుకమ్మ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆదివారం సాయంత్రం 5 గంటలకు ప్రభుత్వం నిర్వహిస్తున్న పెద్ద బతుకమ్మ వేడుకల్లో పాల్గొనాలని మహిళలందరికీ ఆమె ఆహ్వానం పలికారు. ఆడపడుచులందరికీ పేరుపేరునా సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇది ఒక పండుగేకాక తెలంగాణ ప్రాంత అస్తిత్వాన్ని, ప్రజల జీవన విధానాన్ని, తరతరాలుగా కొనసాగుతున్న వారసత్వ సంపదను చాటిచెప్పే అరుదైన సాంస్కృతిక వేడుక అని అన్నారు. పూలతో చెరువులను శుద్ధి చేసుకుంటూ, ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే పండుగ బతుకమ్మ అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సాధారణంగా పూలతో దేవుళ్లను పూజిస్తామని, కానీ పూలనే దేవతలుగా భావించి పూజించే ప్రత్యేకమైన సంప్రదాయం బతుకమ్మ పండుగలో కనిపిస్తుందని వివరించారు. నవధాన్యాలను ప్రసాదాలుగా పంచుకుంటూ ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపే సంప్రదాయం ఈ పండుగలో అంతర్భాగమన్నారు. ఆత్మీయత, అనురాగాలను కలబోసుకుని, కష్టసుఖాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ మహిళలంతా కలిసిమెలిసి జరుపుకునే పండుగ బతుకమ్మ అని సీతక్క తెలిపారు. ఈ వేడుక మహిళల్లో ఐక్యతను, ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తుందన్నారు. తరతరాలుగా మహిళలు తమ సంస్కృతిని, సంప్రదాయాలను తరువాతి తరాలకు అందిస్తున్నారని, బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ప్రత్యేకతకు, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని వివరించారు. తొమ్మిది రోజులపాటు సాగే ఈ వేడుకల్లో చివరి రోజైన సద్దుల బతుకమ్మను ఆదివారం ఘనంగా జరుపుకోవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పెద్ద బతుకమ్మ వేడుకలకు హైదరాబాద్‌లోని మహిళలందరూ తరలిరావాలని, పూల పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆహ్వానించారు. మీ సీతక్కగా మీ అందరినీ బతుకమ్మ వేడుకలకు ఆహ్వానిస్తున్నాను.. తెలంగాణ ఆడపడుచులందరికీ స్వాగతం.. సుస్వాగతం అని అన్నారు.

# పండుగ పిలుపు.. పల్లెబాట పట్టిన పట్నం!

- దసరా వేళ సొంతూళ్లకు నగరవాసుల పరుగులు
- కిక్కిరిసిన ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్లు
- రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులతో ఏర్పాట్లు
- నగర శివార్ల నుంచే జిల్లాలకు ప్రత్యేక సర్వీసులు
- మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణం
- రద్దీ నియంత్రణకు ప్రత్యేక బృందాలు..
- ప్రయాణికుల భద్రతపై దృష్టి



**హైదరాబాద్, అక్టోబర్ 17 (ఉద్యమ కెరటం):** దసరా పండుగ సందడి మొదలైంది. పట్నం పల్లెబాట పట్టింది. ఏడాదంతా ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువులతో నగరంలో గడిపిన జనం సొంతూళ్లకు పయనమవుతున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి పండుగ జరుపుకోవాలన్న ఉత్సాహంతో భాగ్యనగరం నుంచి వేలాది మంది తరలివెళ్తున్నారు. దీంతో హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. మహాత్మా గాంధీ బస్ స్టేషన్, జూబ్లీ బస్ స్టేషన్‌లలో ఎటుచూసినా ప్రయాణికుల సందడే కనిపిస్తోంది. చేతుల్లో ప్రయాణ సంచులు, వెంట పిల్లాపాపలతో బస్సుల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలతో బస్టాండ్లు కళకళలాడుతున్నాయి. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. దసరా సెలవులు రావడంతో ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో సొంత గ్రామాలకు బయలుదేరుతున్నారు. దీంతో ఎంజీబీఎస్, జేబీఎస్‌లలో ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరిగింది. బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులతో ప్లాట్‌ఫారాలు, నిరీక్షణ గదులు నిండిపోతున్నాయి. కుటుంబాలతో ప్రయాణించే వారు ఎక్కువగా ఉండటంతో బస్టాండ్లలో సందడి నెలకొంది. రద్దీని నియంత్రించడం ఆర్టీసీ అధికారులకు సవాలుగా మారింది. రానున్న రెండు రోజుల్లో ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు. పండుగ సందర్భంగా ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. తెలంగాణలోని వివిధ జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రకు వెళ్లే మార్గాల్లోనూ అదనపు సర్వీసులను అందుబాటులో ఉంచింది. ప్రయాణికులు బస్టాండ్లలో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి తలెత్తకుండా రద్దీకి అనుగుణంగా బస్సులను పంపించేలా చర్యలు చేపట్టింది. బస్సుల రాకపోకలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను నియమించింది. ప్రయాణికులకు అవసరమైన సమాచారం అందించేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచింది. ప్రధాన బస్టాండ్ల వద్ద రద్దీని తగ్గించడంతోపాటు నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఆర్టీసీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. విజయవాడ, సూర్యాపేట, ఖమ్మం వైపు వెళ్లే ప్రయాణికుల కోసం ఎల్బీనగర్, ఉప్పల్ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతోంది. బెంగళూరు, కర్నూలు, మహబూబ్‌నగర్ మార్గాల్లో వెళ్లేవారికి ఆరాంఘర్ నుంచి సర్వీసులు అందుబాటులో ఉంచింది. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ వైపు వెళ్లే ప్రయాణికుల కోసం జేబీఎస్, బోయిన్‌పల్లి ప్రాంతాల్లో బస్సులు ఏర్పాటు చేసింది. దీంతో నగరంలోని ప్రధాన బస్టాండ్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ప్రయాణికులు తమకు సమీపంలోని ప్రాంతాల నుంచి సొంతూళ్లకు బయలుదేరే అవకాశం కలిగింది. నగరంలోని ఐటీ కారిడార్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు పండుగకు సొంతూళ్లకు వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేక సదుపాయాలు కల్పించింది. కేపీహెచ్‌బీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో ప్రత్యేక బస్సులు ఎక్కే కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆయా ప్రాంతాల్లో నివసించే ఉద్యోగులు నగరం మధ్యలోని బస్టాండ్లకు వెళ్లకుండా నేరుగా తమ ప్రాంతాల నుంచే ప్రయాణం ప్రారంభించేలా ఏర్పాట్లు చేసింది. ఈ చర్యలతో ప్రధాన బస్టాండ్లపై ప్రయాణికుల ఒత్తిడి తగ్గడంతోపాటు నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు అవకాశం ఏర్పడింది. దసరా పండుగ ప్రయాణాల్లో మహిళలకు మహాలక్ష్మి పథకం ఆర్థికంగా ఉపశమనం కలిగిస్తోంది. పథకం నిబంధనల ప్రకారం అర్హులైన మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యం వర్తించే బస్సుల్లో ప్రయాణించవచ్చు. ప్రత్యేక సర్వీసుల్లోనూ పథకం వర్తించే బస్సుల్లో అర్హతకు సంబంధించిన గుర్తింపు కార్డులను చూపించి ఉచిత ప్రయాణ టికెట్లు పొందేలా కండక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు. పండుగ వేళ కుటుంబాలతో కలిసి సొంత గ్రామాలకు వెళ్లే మహిళలకు ఈ సదుపాయం ప్రయాణ ఖర్చులను తగ్గిస్తోంది. పండుగ రద్దీ నేపథ్యంలో చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడకుండా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. బస్టాండ్లలో ప్రయాణికులకు మార్గనిర్దేశం చేసేందుకు సిబ్బందిని నియమించారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బస్సుల రాకపోకలను సమన్వయం చేస్తూ ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అవసరానికి అనుగుణంగా అదనపు సర్వీసులను నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దసరా పండుగను సొంత గ్రామాల్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి జరుపుకోవాలన్న ఉత్సాహం నగరవాసుల్లో కనిపిస్తోంది. పల్లెల్లో పండుగ సందడి మొదలవుతుండగా, నగరంలోని బస్టాండ్లు ప్రయాణికుల రాకపోకలతో కళకళలాడుతున్నాయి. ఉద్యోగాలు, చదువుల కోసం నగరానికి వచ్చినవారు కొద్దిరోజులైనా తమవారితో గడిపేందుకు సొంతూళ్లకు బయలుదేరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను అందుబాటులో ఉంచుతూ పండుగ ప్రయాణాలు సజావుగా సాగేలా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు.

# దాండియా సంబరాల్లో మృత్యుఘోష!





- వేడుకల వేళ విద్యార్థులపై కుప్పకూలిన భారీ లైటింగ్ స్టాండ్
- ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో తీవ్ర విషాదం
- వనపర్తి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని సోనీ దుర్మరణం
- మరో 25 మందికి గాయాలు.. ఐదుగురి పరిస్థితి విషమం
- ఈదురుగాలుల ధాటికి లైటింగ్ క్రేన్ కూలినట్లు ప్రాథమిక సమాచారం
- ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి

**హైదరాబాద్, అక్టోబర్ 18 (ఉద్యమ కెరటం):** అప్పటివరకు ఆటపాటలతో సందడిగా సాగిన దాండియా వేడుకల్లో ఒక్కసారిగా విషాదం నెలకొంది. విద్యార్థుల కేరింతలతో మార్మోగిన కళాశాల ప్రాంగణం క్షణాల్లోనే ఆర్తనాదాలతో నిండిపోయింది. హైదరాబాద్ శివారులోని నాదర్‌గుల్ ప్రాంతంలో ఉన్న ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం రాత్రి జరిగిన ఘోర ప్రమాదంలో ఓ విద్యార్థిని ప్రాణాలు కోల్పోగా, సుమారు 25 మంది విద్యార్థులు గాయపడ్డారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కళాశాలలో నిర్వహిస్తున్న 'సంగమం--2026' సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దాండియా వేడుకల సమయంలో భారీ ఇనుప లైటింగ్ స్టాండ్ ఒక్కసారిగా విద్యార్థులపై కుప్పకూలింది. ఈ ఘటనలో వనపర్తి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని సోనీ మృతి చెందింది. ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి సమగ్ర విచారణకు ఆదేశించారు. ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 'సంగమం--2026' పేరుతో సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి దాండియా వేడుకలు ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంగీతం, నృత్యాలతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. అయితే వేడుకలు కొనసాగుతున్న సమయంలో భారీ ఇనుప లైటింగ్ స్టాండ్ ఒక్కసారిగా అదుపుతప్పి విద్యార్థులపై కూలిపోయింది. ఊహించని ఈ ఘటనతో అక్కడున్నవారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు విద్యార్థులు పరుగులు తీయడంతో ప్రాంగణంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ప్రమాదంలో వనపర్తి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని సోనీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థిని ఇలా అకస్మాత్తుగా మృతి చెందడం తోటి విద్యార్థులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రమాదంలో మరో 25 మంది విద్యార్థులు గాయపడినట్లు తెలుస్తోంది. వీరిలో మృతురాలి సోదరితోపాటు ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కళాశాల సిబ్బంది, విద్యార్థులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని అత్యవసర వైద్య చికిత్స కోసం ఎల్బీనగర్‌లోని కామినేని ఆసుపత్రితోపాటు ఆదిభట్ల ప్రాంతంలోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఘటన సమాచారం తెలియడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తమ పిల్లల పరిస్థితి తెలుసుకునేందుకు ఆసుపత్రులను సంప్రదిస్తున్నారు. భారీ ఈదురుగాలుల కారణంగా వేడుకల కోసం ఏర్పాటు చేసిన లైటింగ్ క్రేన్ అదుపుతప్పి కూలిపోయినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. స్టాండ్ కూలిన సమయంలో మంటలు కూడా చెలరేగినట్లు తెలుస్తోంది. దీంతో విద్యార్థులు ప్రాణభయంతో పరుగులు తీశారు. అయితే లైటింగ్ స్టాండ్ ఏర్పాటు చేసిన విధానం, దాని భద్రతా ప్రమాణాలు, విద్యుత్ సరఫరా వ్యవస్థ, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈదురుగాలుల ప్రభావంతోనే ప్రమాదం జరిగిందా, లేక ఏర్పాట్లలో ఏదైనా నిర్లక్ష్యం ఉందా అన్నది విచారణలో తేలనుంది. ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థిని సోనీ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై పూర్తిస్థాయి విచారణ జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. వేడుకల నిర్వహణలో భద్రతా ప్రమాణాలు పాటించారా, భారీ లైటింగ్ ఏర్పాట్ల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకున్నారా అన్న అంశాలను పరిశీలించాలని సూచించారు. నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రమాదానికి గల వాస్తవ కారణాలను గుర్తించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్నేహితులతో కలిసి ఉత్సాహంగా గడపాల్సిన సాంస్కృతిక వేడుక ఓ విద్యార్థిని ప్రాణాలను బలిగొనడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. మరో 25 మంది గాయపడటం, వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం రావడంతో కళాశాల వర్గాల్లో ఆందోళన నెలకొంది. భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనే కార్యక్రమాల్లో భద్రతా ఏర్పాట్ల ప్రాధాన్యాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక విచారణ అనంతరం వెల్లడికానున్నాయి.

# నేటి నుంచి వర్ష సూచన

**పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**

**ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలుల హెచ్చరిక**

**హైదరాబాద్, అక్టోబర్ 17 (ఉద్యమ కెరటం) :** తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. ఉత్తర తమిళనాడు, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. అక్టోబర్ 18 హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.



ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక






# సివిల్ సర్వీసెస్ అధికారుల హెరిటేజ్ వాక్

## నిర్వహించిన పర్యాటక, వారసత్వ శాఖ

**హైదరాబాద్, అక్టోబర్ 17:** శిక్షణలో ఉన్న సుమారు 170 మంది సివిల్ సర్వీసెస్ అధికారుల కోసం రాష్ట్ర పర్యాటక, వారసత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వారసత్వ పర్యటన శనివారం నిర్వహించారు. ఈ వాక్ చారిత్రక కట్టడం చార్మినార్ వద్ద ప్రారంభమై ప్రసిద్ధ చారిత్రక భవనం చౌమహల్లా ప్యాలెస్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా అధికారులకు హైదరాబాద్ నగర చరిత్ర, విశిష్ట నిర్మాణ శైలి, గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని తెలుసుకునే అవకాశం కలిగింది. హైదరాబాద్ నగర సాంస్కృతిక గుర్తింపులో ఈ చారిత్రక కట్టడాల ప్రాధాన్యతను, వాటి చారిత్రక నేపథ్యాన్ని శిక్షణలో ఉన్న అధికారులకు పరిచయం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. రాష్ట్రంలోని చారిత్రక, సాంస్కృతిక సంపదపై అవగాహన కల్పించడంతో పాటు, రాష్ట్ర పర్యాటక ప్రాధాన్యతను చాటిచెప్పేందుకు శాఖ చేపడుతున్న కార్యక్రమాల్లో ఈ పర్యటన ఒక భాగం.

# ఖేలో తెలంగాణ బంధన్‌కు పెరుగుతున్న ఆదరణ

## ప్రజలు, క్రీడాకారుల నుంచి విశేష స్పందన

## ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 17 :** రాష్ట్ర క్రీడా శాఖ చేపట్టిన ఖేలో తెలంగాణ బంధన్ కార్యక్రమానికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని, ప్రజలు, క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభిస్తోందని ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి అన్నారు. శనివారం నిర్వహించిన ఖేలో తెలంగాణ ఫిట్‌నెస్ ఛాలెంజ్‌లో పాల్గొన్న ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, కేంద్ర క్రీడల శాఖ సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే, రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సోనిబాలాదేవి, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌తోపాటు పలువురు అధికారులకు ఫిట్‌నెస్ ఛాలెంజ్ విసిరారు. చిన్నా పెద్దా తేడా లేకుండా, వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ క్రీడలను తమ దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాలని జితేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. క్రమం తప్పకుండా వ్యాయామం, నడక, పరుగు, యోగా వంటి శారీరక దృఢత్వ కార్యకలాపాలను అలవర్చుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని సొంతం చేసుకోవచ్చన్నారు. గత మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యతతో సమాజంలో క్రీడల పట్ల సానుకూల వాతావరణం ఏర్పడుతోందన్నారు. ప్రజలను ఆరోగ్యం, ఫిట్‌నెస్ దిశగా ప్రోత్సహించడంతోపాటు క్రీడా స్ఫూర్తిని ప్రతి ఒక్కరిలో పెంపొందించేందుకు ఖేలో తెలంగాణ బంధన్ దోహదపడుతుందని తెలిపారు. ఖేలో తెలంగాణ కార్యక్రమం నిరంతర ఉద్యమంలా కొనసాగాలని, ప్రజల భాగస్వామ్యంతో ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జితేందర్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించి ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని మీడియాకు విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణలో తీవ్ర కరవు

- 315 మండలాల్లో కరవు ఛాయలు: తుమ్మల నాగేశ్వరరావు
- రాష్ట్రంలో 315 మండలాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నట్టు గుర్తింపు
- కేంద్రం తక్షణమే సాయం చేయాలని కోరిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రాష్ట్రవ్యాప్తంగా 23 శాతం వర్షపాత లోటు, 13 లక్షల ఎకరాల్లో తగ్గిన సాగు
- పంట నష్టపోయిన రైతులకు రూ.1,986 కోట్ల సహాయ ప్యాకేజీ ప్రతిపాదన
- ప్రమాదకరంగా పడిపోయిన జలాశయాల నీటిమట్టాలు



**హైదరాబాద్, అక్టోబర్ 18 (ఉద్యమ కెరటం):** తెలంగాణలో కరవు పరిస్థితులు తీవ్ర రూపం దాల్చాయి. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం గణనీయంగా తగ్గడంతో 315 మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని తక్షణమే ఆదుకోవాలని, సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్), మధ్యంతర పంట విత్తనాల పంపిణీకి అవసరమైన ఆర్థిక సాయం అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వ్యవసాయ సంక్షోభాన్ని ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. మద్దతు ధరతో మొక్కజొన్న, జొన్న తదితర పంటలను 100 శాతం కొనుగోలు చేయాలని, ధరల మద్దతు పథకం కింద ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. రసాయన ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించడంతో పాటు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పనలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇదే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన అనధికారిక క్యాబినెట్ సమావేశంలోనూ సుదీర్ఘంగా చర్చ జరిగింది. రాష్ట్రంలోని 315 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నాయని, వాటిలో 101 మండలాల్లో తీవ్ర కరవు, 214 మండలాల్లో ఓ మోస్తరు కరవు నెలకొందని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. పంట నష్టపోయిన రైతులకు అండగా నిలిచేందుకు రూ. 1,986.89 కోట్లతో కూడిన సహాయ ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. గణాంకాల ప్రకారం, జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య రాష్ట్రంలో సాధారణంగా 740.6 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 615.5 మి.మీ. మాత్రమే నమోదైంది. అక్టోబర్ 15 నాటికి ఈ వర్షపాత లోటు 23 శాతానికి చేరింది. దీని ప్రభావంతో గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం 13.22 లక్షల ఎకరాలు తగ్గి, 126.06 లక్షల ఎకరాలకు పరిమితమైంది. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 3.58 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మరోవైపు, రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. 466 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను ప్రస్తుతం కేవలం 209.45 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఈ పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, సాగునీటి విడుదలను పరిమితం చేయాలని అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. కరవును అధికారికంగా ప్రకటించి, కేంద్రం నుంచి గరిష్ఠంగా సాయం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర నివేదికను సిద్ధం చేస్తోంది.

# గోదావరి-కావేరి లింక్‌తో రాష్ట్రానికి మరణ శాసనం

- బాబు కుట్రకు రేవంత్ మద్దతు
- తెలంగాణ ద్రోహులు మళ్లీ నిద్ర లేచారు
- తెలంగాణ నోట్లో మట్టికొడుతున్న 'చెయ్యి'!
- తెలంగాణ గొంతు కోస్తున్న బాబు
- దేవాదులలో మోటర్లు ఎందుకు నడపలేదు?
- మీ నిర్వాకం వల్ల వరంగల్ జిల్లా కరువు పాలైంది
- బీజేపీ నాయకులు ఏం చేస్తున్నరు?
- నిప్పులు చెరిగిన హరీష్ రావు



**హైదరాబాద్, అక్టోబర్ 17:** నవంబర్ 3న ఢిల్లీలో జరగనున్న ఎన్‌డబ్ల్యుడీఏ మీటింగ్ ఎజెండాలో గోదావరి–కావేరి లింకును చేరుస్తూ రాష్ట్ర నీటి హక్కులకు మరణశాసనం రాస్తున్నారని, అడ్డుకోవాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కుట్రకు మద్దతు పలుకుతూ చారిత్రక ద్రోహానికి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆగ్రహం వెలిబుచ్చారు. తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి–కావేరి లింకును పోలవరం నుంచి చేపట్టాలని, ఎజెండాలో చేర్చాలని ఏపీ సీఎం చంద్రబాబు ఈనెల 7న లేఖ రాయగానే, వెంటనే ఎజెండాలో పొందుపరిచి నవంబర్ 3న మీటింగ్ పెట్టారని హరీశ్ రావు మండిపడ్డారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం కుక్కిన పేనులా పడి ఉన్న తెలంగాణ ద్రోహులంతా ఇవాళ మళ్లీ నిద్రలేచారని విమర్శించారు. పోలవరం–బనకచర్ల లింకు ప్రాజెక్టుతో గోదావరి జలాలను అక్రమంగా ఏపీకి తరలించేందుకు విష కూటమిలా తయారయ్యారని ఆరోపించారు. తెలంగాణలో రేవంత్ సర్కార్ ఏర్పడిన మరుక్షణం నుంచే చంద్రబాబు గోదావరి జలాల దోపిడీ మొదలుపెట్టారని, రాష్ట్ర ప్రభుత్వ మొద్దునిద్ర కారణంగా బాబు ఎత్తులు అమలువుతున్నాయని అన్నారు. గోదావరిలో 200 టీఎంసీలు తరలించేందుకు మొదట పోలవరం–బనకచర్ల తెచ్చారని, ఆ తర్వాత నల్లమలసాగర్‌గా మార్చారని, ఇప్పుడు కేంద్రంతో ఒప్పించి గోదావరి–కావేరి నదుల అనుసంధానం పేరిట బనకచర్లకు మార్గం సుగమం చేసుకుంటున్నారని హరీశ్ రావు దుయ్యబట్టారు. చంద్రబాబు ఇప్పుడు గోదావరి–కావేరి ముసుగులో నేరుగా పోలవరం నుంచి బొల్లపల్లి, నాగార్జున సాగర్ సోమశిల ద్వారా కావేరికి నీళ్లు తరలించే ప్లాన్ చేశారని తెలిపారు. కేసీఆర్ హెచ్చరించినట్టుగా 'కత్తి పరాయి వాడిదే కానీ.. పొడిచే చెయ్యి మనోడిదే' అన్నట్లుగా రేవంత్ రెడ్డి తెలంగాణ నోట్లో మట్టికొడుతున్నాడని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇది ముమ్మాటికీ జాతి ద్రోహమని, నువ్వు చేస్తున్న జల ద్రోహానికి భవిష్యత్ తరాలు కూడా క్షమించవని సీఎం రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. బనకచర్ల విషయంలో తాము అనేకసార్లు హెచ్చరించినా పట్టించుకోలేదన్నారు. దేవాదులలో నీళ్లు వస్తున్నా పది మోటార్లు నడవాల్సిన చోట మూడే ఎందుకు నడుపుతున్నావని నిలదీశారు. దేవాదులలో పూర్తిస్థాయిలో మోటార్లు నడిపి ఉంటే వరంగల్‌లో కరువు వచ్చేది కాదని, ఏపీలో కరువు లేకున్నా తెలంగాణలో మాత్రం పంటలు వేయొద్దంటున్నారని ఆక్షేపించారు. మ్యాప్‌లు పరిశీలించాలని హోరూశ్ రావు హితవు పలకగా, చంద్రబాబు లేఖ రాసి పది రోజులు అవుతున్నా రేవంత్ రెడ్డి పెదవి విప్పకపోవడం వెనుక ఉన్న ఒప్పందమేంటని నిలదీశారు. బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కూడా తెలంగాణ హక్కులను కాపాడే బాధ్యత విస్మరించారని విమర్శించారు. తెలంగాణ జాతికి మోసం చేస్తే ప్రజలు ఊరుకోరని, ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మూడు దశల్లో సమగ్ర భూ రీ సర్వే

- 285 గ్రామాల్లో సర్వే పూర్తి
- అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు
- నవంబర్ చివరినాటికి మొదటి దశ పూర్తికి సన్నాహాలు
- పాలేరు నియోజకవర్గంలో త్వరలో భూదార్ పట్టాల పంపిణీ
- రెవెన్యూ అధికారుల సమీక్షలో మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, అక్టోబర్ 18 (ఉద్యమ కెరటం):** భూ సమస్యలు, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతూ ప్రతి భూకమతానికి కచ్చితమైన హద్దులు నిర్ణయించి భూ యాజమాన్య హక్కులపై స్పష్టత కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన సమగ్ర భూ రీ సర్వేను మూడు దశల్లో పూర్తి చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భూ సర్వే పురోగతిపై సచివాలయంలో రెవెన్యూ అధికారులతో శనివారం నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే 285 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేసి భూ యజమానుల నుంచి అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ప్రస్తుతం ఉన్న 411 రోవర్లకు అదనంగా మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయని వివరించారు. ప్రజల సంతృప్తే ప్రాధాన్యంగా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలకు గాను తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసి నక్షాలు అందుబాటులో లేని గ్రామాలను కూడా కలుపుకుని మొత్తం 2,720 గ్రామాల్లో రీ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుకు భూమి ఆస్తి మాత్రమే కాదని, అది అతని జీవనాధారమని మంత్రి పేర్కొన్నారు. ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబరుకు ప్రత్యేక భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ యాజమాన్య హక్కులపై స్పష్టత తీసుకురావడంతో పాటు తరతరాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు పరిష్కారం చూపడంలో సమగ్ర రీ సర్వే కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారాలుగా ఉన్నాయని, కాలక్రమేణా భూముల విభజనలు, సర్వే నంబర్ల ఉప విభాగాలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దుల్లో మార్పులు చోటుచేసుకోవడం వంటి కారణాలతో భూముల అసలు హద్దులపై స్పష్టత కొరవడిందని అన్నారు. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 2 కోట్ల 29 లక్షలకు పెరిగిందని వివరించారు. సంప్రదాయ పరికరాలకు స్వస్తి పలుకుతూ డీజీపీఎస్, రోవర్లు, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని, వీటి ద్వారా వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరిచి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపునిచ్చేలా భూదార్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. తన సొంత నియోజకవర్గమైన పాలేరులోని నేలకొండపల్లి మండలం కొంగర గ్రామ పరిధిలో ఉన్న మొత్తం 665 ఎకరాల్లో వంద శాతం రీ సర్వేను విజయవంతంగా పూర్తిచేశామని, త్వరలో భూదార్ పట్టాలు పంపిణీ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. గ్రామాల్లో సర్వే నిర్వహించేందుకు వెళ్లే ముందు సంబంధిత పట్టాదారులకు విధిగా ముందస్తు నోటీసులు ఇవ్వాలని, సర్వేకు ఒకటి రెండు రోజుల ముందు ఆయా గ్రామాల్లో తప్పనిసరిగా చాటింపు వేయాలని సూచించారు. గ్రామాల్లోని ప్రభుత్వ భూములకు స్పష్టమైన మార్కింగ్ చేయాలని, గ్రామకంఠం హద్దులను నిర్ధారించిన తర్వాతే సర్వే చేపట్టి అభ్యంతరాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. భూ రీ సర్వేను అధికారులు ప్రభుత్వ విధిగా భావించకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అత్యంత కీలక బాధ్యతగా గుర్తించాలని పొంగులేటి సూచించారు.





# రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో విజయం సాధించాలి

## బీజేపీ చీఫ్ రామచందర్‌రావు

**హైదరాబాద్, అక్టోబర్ 17 :** రాబోయే రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన అధ్యక్షతన పట్టభద్రుల ఎమ్మెల్సీ వోటర్ల నమోదుపై కీలక సన్నాహక సమావేశం శనివారం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, మల్క కొమురయ్యలతోపాటు రెండు ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు చెందిన పార్టీ ముఖ్య నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ గతంలో హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని దివంగత నేత వి.రామారావు పలుమార్లు గెలుచుకున్నారని, ఇతర స్థానాల్లోనూ బీజేపీ అభ్యర్థులు ఘన విజయం సాధించిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. అభ్యర్థులు ఎవరనే దానితో సంబంధం లేకుండా పార్టీ గెలుపే ధ్యేయంగా కార్యకర్తలంతా సమష్టిగా పనిచేయాలని స్పష్టం చేశారు. వోటర్ల నమోదు ప్రక్రియపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడితో పాటు వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు ఓటరు నమోదుపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. విద్యావంతులను వోటర్లుగా నమోదు చేయించడంతోపాటు, పోలింగ్ రోజున వారు తమ వోటు హక్కును సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో కార్యకర్తలు చొరవ చూపాలని కోరారు. బీజేపీ పట్ల విద్యావంతులు, గ్రాడ్యుయేట్లలో బలమైన సానుకూలత ఉందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ఇదే సమయంలో దేశ ప్రతిష్ఠను దిగజార్చేలా సాగుతున్న 'వోట్ చోరీ' ప్రచారం వెనుక విదేశీ శక్తుల ప్రమేయం దాగి ఉందని ఆయన హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను పార్టీ నేతలు, కార్యకర్తలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలో తగిన సమయం కేటాయించి పార్టీని విజయ తీరాలకు చేర్చాలని రామచందర్ రావు పిలుపునిచ్చారు.

ఉద్యమ కెరటం
ఆదివారం 18 అక్టోబర్ 2026

## సంపాదకీయం



# మరోసారి భగ్గుమన్న ఫ్రాన్స్!

### విద్యారంగ సంస్కరణల కోసం దేశవ్యాప్తంగా ఆందోళనలు

### పారిస్‌లో కారుకు, దుకాణానికి నిప్పు..

### లియోన్‌లోనూ హింసాత్మక ఘటనలు

విద్యారంగంలో సమూల సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఫ్రాన్స్‌లో కొనసాగుతున్న ఆందోళనలు మరోసారి హింసాత్మకంగా మారాయి. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, ఉపాధ్యాయుల నియామకాలు, విద్యారంగానికి నిధుల కేటాయింపులపై విద్యార్థులు, నిరసనకారులు చేపట్టిన ఆందోళనలు పలు నగరాల్లో ఉద్రిక్తతలకు దారితీశాయి. రాజధాని పారిస్‌తోపాటు లియోన్, మార్సెయిల్ నగరాల్లో విధ్వంసకర ఘటనలు చోటుచేసుకున్నట్లు సమాచారం. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు, జలఫిరంగులను ప్రయోగించారు. హింసాత్మక ఘటనలకు సంబంధించి దేశవ్యాప్తంగా 166 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

#### పారిస్‌లో కారుకు, దుకాణానికి నిప్పు

ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోని నగర కేంద్రానికి సమీపంలో ఆందోళనలు ఉద్రిక్తంగా మారాయి. నిరసనల సందర్భంగా కొందరు ఆందోళనకారులు ఒక కారుతోపాటు దుకాణానికి నిప్పంటించినట్లు సమాచారం. దీంతో పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు బాష్పవాయు గోళాలు, జలఫిరంగులను ప్రయోగించారు. నిరసనల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సాధారణ జనజీవనానికి అంతరాయం ఏర్పడింది.

#### లియోన్‌లో పర్యాటక కార్యాలయానికి నిప్పు

ఫ్రాన్స్‌లోని ప్రధాన నగరాల్లో ఒకటైన లియోన్‌లోనూ హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆందోళనల సందర్భంగా ఓ పర్యాటక కార్యాలయానికి నిప్పంటించినట్లు సమాచారం. మరోవైపు మార్సెయిల్ నగరంలో నిరసనకారులు ఓ పోలీస్ స్టేషన్‌తోపాటు పలు దుకాణాలను ధ్వంసం చేసినట్లు వెల్లడైంది. వరుస ఘటనలతో పలు నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. హింసాత్మక ఘటనలకు పాల్పడిన వారిని గుర్తించి అరెస్టు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఫ్రాన్స్‌లో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొన్ని రోజులుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. పాఠశాలల్లో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం, ఉపాధ్యాయ సిబ్బంది కొరత, విద్యారంగానికి తగినన్ని నిధులు కేటాయించకపోవడం, పాఠశాల భవనాలు అధ్వానంగా ఉండటం వంటి సమస్యలను నిరసనకారులు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పాఠశాల విద్యతోపాటు విశ్వవిద్యాలయాల ప్రవేశాల వ్యవస్థపైనా విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రవేశాల ప్రక్రియ సంక్లిష్టంగా ఉందని, విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపిస్తున్నారు. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని కోరుతూ ఆందోళనల్లో పాల్గొంటున్నారు. ఈ నిరసనలకు కార్మిక సంఘాలు కూడా మద్దతు ప్రకటించినట్లు సమాచారం. దీంతో విద్యారంగ సమస్యలపై ప్రారంభమైన ఆందోళనలు విస్తృత స్థాయికి చేరుకున్నాయి.

#### 166 మంది అరెస్టు.. కొనసాగుతున్న ఉద్రిక్తత

పలు నగరాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడంతో పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు. విధ్వంసానికి పాల్పడినట్లు అనుమానిస్తున్న 166 మందిని దేశవ్యాప్తంగా అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఇటీవల వందలాది పాఠశాలలకు నిప్పంటించినట్లు కూడా కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ ఘటనల పూర్తి వివరాలు, నష్టం తీవ్రతపై అధికారిక నిర్ధారణ అవసరం. విద్యారంగ సంస్కరణల కోసం కొనసాగుతున్న నిరసనలు హింసాత్మకంగా మారుతుండటంతో ఫ్రాన్స్‌లో పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి.



# పిల్లలకూ ఇంటర్నెట్ వాడే హక్కు

**నిషేధం పరిష్కారం కాదు!**

### ఆన్‌లైన్ భద్రత పేరుతో ఇంటర్నెట్‌కు దూరం చేయొద్దు

- వయసుతో సంబంధం లేకుండా పిల్లలకూ డిజిటల్ ప్రపంచంలో భాగస్వామ్యం
- భావప్రకటన స్వేచ్ఛలో ఇంటర్నెట్ వినియోగానికీ ప్రాధాన్యం
- సామాజిక మాధ్యమ సంస్థల వైఫల్యాలకు పిల్లలను బాధ్యులను చేయలేం
- పిల్లల భద్రతకు ప్రత్యేక చైల్డ్ మోడ్‌పై సుప్రీంకోర్టు సూచన



**న్యూఢిల్లీ, అక్టోబర్ 17 (ఉద్యమ కెరటం):** పిల్లల ఆన్‌లైన్ భద్రత పేరుతో వారికి ఇంటర్నెట్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించడం సరైన పరిష్కారం కాదని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పిల్లలకు కూడా వయసుతో సంబంధం లేకుండా ఇంటర్నెట్ ద్వారా సమాచారం పొందే, అభిప్రాయాలను వ్యక్తం చేసే అవకాశాలు ఉండాలని స్పష్టం చేసింది. డిజిటల్ ప్రపంచంలో పిల్లల భాగస్వామ్యాన్ని అడ్డుకోవడం కంటే వారిని ఆన్‌లైన్ ప్రమాదాల నుంచి రక్షించేందుకు సమర్థవంతమైన నియంత్రణ వ్యవస్థలను ఏర్పాటు చేయడం ముఖ్యమని అభిప్రాయపడింది. జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగంలోని 19(1)(ఎ) అధికరణం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు ఇంటర్నెట్ వినియోగంతో సన్నిహిత సంబంధం ఉందని ధర్మాసనం పేర్కొంది. సమాచారాన్ని తెలుసుకోవడం, అభిప్రాయాలను వ్యక్తం చేయడం, ఇతరులతో ఆలోచనలను పంచుకోవడం వంటి అవకాశాలను ఇంటర్నెట్ విస్తృతం చేసిందని వివరించింది. డిజిటల్ సాంకేతికత నిత్యజీవితంలో కీలకంగా మారిన నేపథ్యంలో పిల్లలను పూర్తిగా ఇంటర్నెట్‌కు దూరం చేయడం వారి విద్యా, సమాచార అవకాశాలపై ప్రభావం చూపుతుందని అభిప్రాయపడింది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో నివసించే పిల్లలకు విద్యా సంబంధిత సమాచారం, అభ్యాస వనరులు అందించడంలో ఇంటర్నెట్ కీలక పాత్ర పోషిస్తోందని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. పాఠశాలలు, గ్రంథాలయాలు, ఇతర విద్యా సౌకర్యాలు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో డిజిటల్ వేదికలు పిల్లలకు ఉపయోగపడుతున్నాయని పేర్కొంది. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు తమలాంటి పరిస్థితుల్లో ఉన్నవారితో పరిచయాలు పెంచుకోవడానికి, అనుభవాలను పంచుకోవడానికి, సామాజికంగా అనుసంధానం కావడానికి కూడా ఇంటర్నెట్ దోహదపడుతుందని వివరించింది. సామాజిక మాధ్యమాల్లో హానికరమైన సమాచారం, అనుచిత దృశ్యాలు, ప్రమాదకరమైన అంశాలు పిల్లలకు అందుబాటులోకి రావడంపై ఆందోళనలు సహజమేనని ధర్మాసనం పేర్కొంది. అయితే అలాంటి సమాచారాన్ని గుర్తించి తొలగించడంలో సామాజిక మాధ్యమ సంస్థలు విఫలమైతే అందుకు పిల్లలను బాధ్యులుగా చూడటం సరికాదని అభిప్రాయపడింది. ఆన్‌లైన్ వేదికలను సురక్షితంగా నిర్వహించాల్సిన బాధ్యత ఆయా సంస్థలపై కూడా ఉంటుందని స్పష్టం చేసింది.

#### చైల్డ్ మోడ్‌తో రక్షణకు అవకాశం

పిల్లల ఇంటర్నెట్ వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించడం కంటే వయసుకు తగిన భద్రతా ఏర్పాట్లు చేయడం అవసరమని సుప్రీంకోర్టు సూచించింది. సామాజిక మాధ్యమ ఖాతాల్లో ప్రత్యేకంగా 'చైల్డ్ మోడ్' ప్రవేశపెట్టే అవకాశాన్ని పరిశీలించాలని ప్రస్తావించింది. పిల్లలకు హానికరమైన సమాచారం చేరకుండా నిరోధించడం, వారి వ్యక్తిగత వివరాలకు రక్షణ కల్పించడం, వయసుకు తగిన అంశాలనే అందుబాటులో ఉంచడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని వివరించింది. డిజిటల్ యుగంలో పిల్లల విద్య, సమాచార అవసరాలను గుర్తించడంతోపాటు వారి భద్రతను కూడా పరిరక్షించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం వ్యాఖ్యల సారాంశం స్పష్టం చేస్తోంది. పిల్లలకు ఇంటర్నెట్ అందుబాటును పూర్తిగా నిరాకరించకుండా తగిన నియంత్రణలు, రక్షణ చర్యలతో సురక్షిత వినియోగాన్ని ప్రోత్సహించాలనే అంశం ఈ వ్యాఖ్యల్లో ప్రధానంగా నిలిచింది.

# నిరసనల్లో మహిళలపై లైంగిక వేధింపులా?

- ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయానికి మహిళా సంఘాల నిరసన ర్యాలీ
- మహిళా జర్నలిస్టులనూ వేధించారంటూ ఆగ్రహం
- జూలై 20 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగిన ఘటనలపై ఫిర్యాదు
- వీడియో ఆధారాలతో పోలీసు ఉన్నతాధికారులకు వినతిపత్రం




**న్యూఢిల్లీ, అక్టోబర్ 17 (ఉద్యమ కెరటం):** ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపేందుకు వచ్చిన మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు జరుగుతున్నాయంటూ ఢిల్లీలో మహిళా సంఘాలు ఆందోళనకు దిగాయి. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనల సందర్భంగా మహిళల భద్రతకు ముప్పు ఏర్పడుతోందని ఆరోపించాయి. ఆందోళనల్లో పాల్గొంటున్న మహిళలతోపాటు వార్తల సేకరణకు వెళ్లిన మహిళా జర్నలిస్టులపైనా కొందరు అసభ్యంగా ప్రవర్తించారని మండిపడ్డాయి. ఈ ఘటనలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించాయి.

#### దాడులను అరికట్టాలంటూ నినాదాలు

ఢిల్లీలో కొద్దిరోజులుగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా వివిధ రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, ఇండియా కూటమికి చెందిన పక్షాలతోపాటు పలు విద్యార్థి సంఘాలు ఈ నిరసనల్లో పాల్గొంటున్నాయి. మహిళలు కూడా పెద్ద సంఖ్యలో ఆందోళనలకు హాజరవుతున్నారు. అయితే నిరసనల సందర్భంగా కొందరు మహిళలు లైంగిక వేధింపులు, భౌతిక దాడులకు గురైనట్లు మహిళా సంఘాలు ఆరోపించాయి. శాంతియుతంగా నిరసన తెలిపే మహిళలకు రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని విమర్శించాయి. మహిళలపై జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న వేధింపులను నిరసిస్తూ ఐద్వా, ఐప్వా, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, ఏఐఎంఎస్ఎస్, అలిఫా, ఎస్ఎఫ్ఐ తదితర సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. గురుద్వారా బంగ్లా సాహిబ్ నుంచి ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. మహిళలపై హింసను అరికట్టాలని, లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. నిరసనల్లో పాల్గొనడం ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కని, ఆ హక్కును వినియోగించుకునే మహిళలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులదేనని సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఆందోళనలను కవర్ చేసేందుకు వెళ్లిన మహిళా జర్నలిస్టుల పట్ల కూడా కొందరు అసభ్యంగా ప్రవర్తించినట్లు మహిళా సంఘాలు ఆరోపించాయి. విధి నిర్వహణలో ఉన్న పాత్రికేయులకు సైతం రక్షణ లేకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నాయి. మహిళలపై జరిగినట్లు చెబుతున్న దాడులకు సంబంధించిన కొన్ని వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్నాయని తెలిపాయి. ఆయా వీడియోలను ఆధారాలుగా చూపిస్తూ పోలీసు ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించాయి. జూలై 20 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగిన నిరసనల సందర్భంగా మహిళలపై పలు దాడులు, వేధింపులు చోటుచేసుకున్నాయని సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ ఘటనలపై ఫిర్యాదులు చేసినప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో పోలీసు ఉన్నతాధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. మహిళల భద్రతకు సంబంధించిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నిరసనల్లో పాల్గొనే మహిళలకు, విధులు నిర్వహించే మహిళా జర్నలిస్టులకు తగిన రక్షణ కల్పించాలని మహిళా సంఘాలు కోరాయి. లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. మహిళలపై హింసను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశాయి. కాగా, మహిళా సంఘాలు చేసిన ఆరోపణలు, సమర్పించిన వీడియో ఆధారాలపై పోలీసుల అధికారిక స్పందన, దర్యాప్తు వివరాలు తెలియాల్సి ఉంది.

# మురికి టాయిలెట్ ఫొటో పెడితే రూ.వెయ్యి రివార్డు

- వాహనదారులకు ఎన్‌హెచ్ఏఐ బంపర్ ఆఫర్
- టోల్‌ప్లాజాల్లో అపరిశుభ్ర మరుగుదొడ్లను గుర్తిస్తే బహుమతి
- రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లో ఫొటో అప్‌లోడ్ చేస్తే చాలు
- ఫాస్టాగ్ రీఛార్జ్ రూపంలో రూ.వెయ్యి రివార్డు
- అక్టోబర్ 31 వరకు ప్రత్యేక కార్యక్రమం




**న్యూఢిల్లీ, అక్టోబర్ 17 (ఉద్యమ కెరటం):** జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం వినూత్న అవకాశాన్ని కల్పించింది. టోల్‌ప్లాజాల్లో అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లను గుర్తించి ఫొటో తీసి పంపిస్తే రూ.వెయ్యి బహుమతి పొందే అవకాశం కల్పిస్తోంది. జాతీయ రహదారులపై మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతోపాటు మరుగుదొడ్ల పరిశుభ్రతను పెంచేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'క్లీన్ టాయిలెట్ పిక్చర్ ఛాలెంజ్' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమం అక్టోబర్ 31 వరకు అందుబాటులో ఉంటుందని ప్రకటించింది. జాతీయ రహదారులపై ఉన్న టోల్‌ప్లాజాల్లో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉంటే వాహనదారులు ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం ప్రత్యేకంగా కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. మురికిగా ఉన్న మరుగుదొడ్డి ఫొటో తీసి 'రాజ్‌మార్గ్ యాత్ర' యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసే వ్యక్తి పేరు, మరుగుదొడ్డి ఉన్న ప్రదేశం, వాహన రిజిస్ట్రేషన్ నంబర్, మొబైల్ నంబర్ తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో భాగంగా అర్హత పొందిన ఫిర్యాదుదారులకు రూ.వెయ్యి బహుమతిని ఫాస్టాగ్ రీఛార్జ్ రూపంలో అందించనున్నట్లు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ తెలిపింది. వాహన రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా రివార్డును అందించే విధానాన్ని అమలు చేయనుంది. అయితే ఫొటో అప్‌లోడ్ చేసిన ప్రతి ఒక్కరికీ బహుమతి ఆటోమేటిక్‌గా లభించదని, ఫిర్యాదు అర్హతను పరిశీలించిన తర్వాతే రివార్డు వర్తిస్తుందని గుర్తుంచుకోవాలి. ఈ పథకానికి కొన్ని పరిమితులు ఉన్నాయి. జాతీయ రహదారులపై టోల్‌ప్లాజాల నిర్వహణ పరిధిలో ఉన్న మరుగుదొడ్లకు మాత్రమే ఈ కార్యక్రమం వర్తిస్తుంది. పెట్రోల్ బంకులు, రహదారి పక్కన ఉన్న దాబాలు, హోటళ్లు, ఇతర ప్రైవేటు ప్రదేశాల్లోని మరుగుదొడ్ల ఫొటోలు పంపితే బహుమతి వర్తించదని సంస్థ స్పష్టం చేసింది. జాతీయ రహదారులపై ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణిస్తుంటారు. ప్రయాణికులకు తాగునీరు, విశ్రాంతి సదుపాయాలతోపాటు పరిశుభ్రమైన మరుగుదొడ్లు అందుబాటులో ఉండటం అత్యవసరం. టోల్‌ప్లాజాల్లో మరుగుదొడ్ల నిర్వహణలో లోపాలను గుర్తించేందుకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వాహనదారుల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించడం ద్వారా అపరిశుభ్రత సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. దీంతో ఇకపై టోల్‌ప్లాజాలో మురికి మరుగుదొడ్డి కనిపిస్తే ఫొటో తీసి ఫిర్యాదు చేయడం ద్వారా పరిశుభ్రత మెరుగుదలకు సహకరించడంతోపాటు రూ.వెయ్యి రివార్డు పొందే అవకాశం కూడా ఉంది.

# జవహర్ బాల్ మంచ్ జిల్లా చైర్మన్ కు సన్మానం



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** జవహర్ బాల్ మంచ్ జిల్లా చైర్మన్‌గా నియమితులైన నైతం రాంచందర్‌ను తిర్యాణి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోట్నాక గణపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నైతం రాంచందర్‌కు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాలల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ప్రజాస్వామ్య విలువలు, సామాజిక బాధ్యత, సేవాభావాన్ని పెంపొందించడంలో జవహర్ బాల్ మంచ్ కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ బాలల అభ్యున్నతికి, పార్టీ బలోపేతానికి కృషి చేసి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉంటూ ప్రజాసేవకు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిర్యాణి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా నాయకులు, వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

**ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఎంపీ రఘురామ్ రెడ్డి**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ప్రభుత్వం అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురామ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణలు అన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామంలో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనాలు అందించడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పీచరలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని పీచర గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులు స్థల పరిశీలన నిర్వహించారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియలో భాగంగా ఈ పరిశీలన చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బైరి లింగవ్వ, రాజేందర్, మండల ఎంపీ శంకర్, జీపీఓ అడెల్లు, అటవీ శాఖ అధికారి జాదవ్ సుదర్శన్‌తో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించి, అవసరమైన అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పూర్తయితే గ్రామ పరిపాలనకు అవసరమైన మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సౌకర్యవంతంగా అందించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు.

# డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి



**ఉద్యమ కెరటం, మల్కాజిగిరి:** జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్యకు ప్రభుత్వం తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని బీజేపీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న దుర్వాసనతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డుపై మీడియాలో వస్తున్న కథనాల నేపథ్యంలో శుక్రవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా కార్మిక నగర్‌లో బస చేసిన ఆయన అక్కడి పరిస్థితులపై స్పందించారు. ఇంతటి ఘోరమైన దుర్వాసనను మాటల్లో వర్ణించలేమని, ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు. డంపింగ్ యార్డును ఇక్కడి నుంచి తొలగిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని స్థానిక ఎమ్మెల్యేపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. డంపింగ్ యార్డు ద్వారా సుమారు 20లక్షల మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కార్మిక నగర్‌లో నివసిస్తున్న సుమారు 8వేల మంది ప్రజలు ప్రతిరోజూ నరకయాతన అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. దుర్వాసన కారణంగా చర్మ, శ్వాసకోశ, గుండె, కిడ్నీ, ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతటి జనాభా నివసిస్తున్న ప్రాంతంలో కనీసం అంగన్‌వాడీ కేంద్రం, ఆసుపత్రి, పాఠశాల లేకపోవడం విచారకరమన్నారు. మేడ్చల్ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు జవహర్ నగర్ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, డంపింగ్ యార్డు తొలగింపు కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట కమిటీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

# పశువుల నీటి తొట్టెలు, ఇంకుడు గుంతల నిర్మాణానికి చర్యలు

- **సాచురేషన్ విధానంలో పనుల గుర్తింపు**
- **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు, భూగర్భ జలాల సంరక్షణకు పశువుల నీటి తొట్టెలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. విబిజి రామ్ జి పథకం కింద అవసరమైన పనులను సాచురేషన్ విధానంలో గుర్తించి, అంచనాలు సిద్ధం చేసి, పరిపాలనా అనుమతులు పొందిన అనంతరం నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని శనివారం సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు గ్రామాల వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి పశువుల నీటి తొట్టెలు అవసరమైన ప్రాంతాలను గుర్తించాలని తెలిపారు. వెటర్నరీ శాఖ అందించిన జాబితాలోని గ్రామాలతో పాటు, ఆయా మండలాల్లో అదనంగా అవసరమైన గ్రామాలను కూడా గుర్తించి సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని స్పష్టం చేశారు. నీటి తొట్టెల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించి, ప్రతి పనికి అవసరమైన అంచనాలను సిద్ధం చేయాలన్నారు. అలాగే గ్రామాల్లోని వాటర్ ప్లాంట్ల వద్ద నీటి వృథాను అరికట్టేందుకు, భూగర్భ జలాల సంరక్షణకు కమ్యూనిటీ ఇంకుడు గుంతలు నిర్మించాలని తెలిపారు. వాటర్ ప్లాంట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన ప్రాంతాలను గుర్తించి నిర్మాణ ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

**సాచురేషన్ విధానంలో పనులు..**

పశువుల నీటి తొట్టెలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు అవసరమైన అన్ని గ్రామాలను గుర్తించి, ఏ గ్రామంలోనూ పనులు మిగిలిపోకుండా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల గుర్తింపు నుంచి అంచనాల తయారీ, అనుమతులు, నిర్మాణాల ప్రారంభం, పూర్తయ్యే వరకు ప్రతి దశను అధికారులు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. పశువుల నీటి తొట్టెల నిర్మాణ పనుల వివరాలు యుక్తధారలో ఇంకా అప్‌డేట్ కానందున, వాటి అంచనాలను విబిజి రామ్ జి సాఫ్ట్‌వేర్‌లో నార్మల్ మోడ్‌లో సిద్ధం చేయాలని సూచించారు. వివరాల నమోదు, అంచనాల తయారీలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతంగా చేపట్టి, గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు తాగునీటి సదుపాయం, నీటి సంరక్షణకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపర్చాలని స్పష్టం చేశారు.

# 'జల్, జంగిల్, జమీన్' నినాదంతో సాగిన మహా యోధుడు

- **జోడేఘాట్ వీరభూమిలో ఆదివాసీల సాంప్రదాయాలు, ఆచారాల ఘనత**





**ఉద్యమ కెరటం కెరమెరి:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన సీమలో విప్లవ జ్వాలలను రగిలించి, నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా 'జల్, జంగిల్, జమీన్' (నీరు, అడవి, భూమి) అనే నినాదంతో అడవి బిడ్డల హక్కుల కోసం ప్రాణాలర్పించిన మహా యోధుడు అమరవీరుడు కొమురం భీమ్. కెరమెరి మండల పరిధిలోని జోడేఘాట్ ప్రాంతం కేవలం పోరాట గడ్డ మాత్రమే కాదు.. అది ఆదివాసీల అచ్చమైన ఆచారాలు, సాంప్రదాయాలు, ప్రకృతిని పూజించే జీవన విధానానికి సజీవ సాక్ష్యం.

**ప్రకృతిని దేవుడిగా కొలిచే ఆదివాసీల జీవనశైలి..**

అడవితో మమేకమై జీవించే ఆదివాసీల సంస్కృతి అత్యంత ప్రత్యేకమైనది. చెట్లు, పుట్టలు, నదులు, కొండలను తమ ఆరాధ్య దైవాలుగా భావించి పూజించడం వారి అనాది ఆచారం. ప్రతియేటా నిర్వహించే సాంప్రదాయ పండుగలు, ఆచార వ్యవహారాలు వారి ఐక్యతను చాటుతాయి. జోడేఘాట్ నేల చుట్టూ అల్లుకున్న ఈ సంస్కృతి, ఆదివాసీల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తోంది.

**అడవే కోటగా.. పోరాటమే ఊపిరిగా..**

ఆదిలాబాద్ అడవులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, ఆదివాసీల హక్కుల కోసం ధీశాలి కొమురం భీమ్ పోరాడారు. అన్యాయాన్ని ఎదిరించే గుణం, అణగారిన వర్గాల కోసం పోరాడే తత్వం ఆయనను ఒక సాధారణ గిరిజన బిడ్డ నుంచి మహా యోధుడిగా మార్చాయి. కెరమెరి అడవులు, జోడేఘాట్ లోయలు ఆయన వీర విహారానికి, వ్యూహాత్మక పోరాటాలకు వేదికలయ్యాయి. నిజాం నవాబుల సైన్యంతో అలుపెరగని పోరాటం చేస్తూ, ఈ గడ్డపైనే ఆయన వీరమరణం పొందారు.



**నేటికీ నిలిచివున్న ఆశయాలు.. మరువలేని జ్ఞాపకాలు**

కొమురంభీమ్ పోరాడిన జోడేఘాట్ ప్రాంతం నేడు ఒక చారిత్రక పుణ్యక్షేత్రంగా విలసిల్లుతోంది. ఇక్కడి మట్టిలో ఆ మహావీరుడి చెమట, రక్తం ఇంకిపోయి ఉన్నాయి. ఆదివాసీల సంస్కృతిని, వారి సాంప్రదాయ జీవన విధానాన్ని కాపాడుకుంటూ, భవిష్యత్తు తరాలకు అందించడమే కొమురంభీమ్‌కు అర్పించే నిజమైన నివాళి అని గిరిజన పెద్దలు గుర్తుచేస్తున్నారు.

**త్యాగధనునికి ప్రజల నివాళి**

తరాలు మారుతున్నా, కాలం కరుగుతున్నా కొమురంభీమ్ పేరు చెబితేనే గిరిజన హృదయాలు ఉప్పొంగుతాయి. వారి సాంప్రదాయ ఉత్సవాలు, జాతరలలో కొమురంభీమ్‌ను స్మరించుకోవడం ఇక్కడి ప్రజల ఆచారం. జోడేఘాట్ గడ్డపై ప్రతిధ్వనించే ఆయన అడుగుజాడలు ఆదివాసీల ఆత్మగౌరవ పతాకను ఎప్పటికీ ఎగరేస్తూనే ఉంటాయి.

# ఆయుష్ శాఖలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- **ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి**
- **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జాతీయ ఆయుష్ మిషన్ పరిధిలో ఆదిలాబాద్ జిల్లాలో వివిధ విభాగాల్లో 10 ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ఆయుష్ మెడికల్ ఆఫీసర్ (పీజీ అర్హతతో) ఒకటి, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ మూడు, డైటీషియన్ ఒకటి, సైకోసోషల్ కౌన్సెలర్ (ఆన్ కాల్) ఒకటి, యోగా ప్రొఫెషనల్ ఒకటి, మల్టీ పర్పస్ వర్కర్ (ఎంపీడబ్ల్యూ) మూడు పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హతలు, దరఖాస్తు ఫారం, ఇతర వివరాలను జిల్లా అధికారిక వెబ్‌సైట్ adilabad.telangana.gov.in లో పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 26వ తేదీ వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆదిలాబాద్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. సాయంత్రం 4 గంటల తర్వాత అందిన దరఖాస్తులను స్వీకరించబోమని స్పష్టం చేశారు. పోస్టు ద్వారా దరఖాస్తులు పంపినప్పుడు జరిగే ఆలస్యానికి శాఖ బాధ్యత వహించదని తెలిపారు. నోటిఫికేషన్‌ను ఎప్పుడైనా రద్దు చేసే అధికారం నియామక కమిటీకి ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు జిల్లా ఆయుష్ నోడల్ అధికారిని సెల్:8639785919 పై సంప్రదించాలని సూచించారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదులో ఇక్కట్లు

- డిగ్రీ సర్టిఫికెట్లపై గెజిటెడ్ సంతకాల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- ఫారం-18 దరఖాస్తు చేసినా తప్పని సంతకం నిబంధన
- ఉపాధి కోసం ఇతర పట్టణాల్లో ఉంటున్న యువతకు తప్పని తిప్పలు
- ఇంటివద్దకే వచ్చి వెరిఫికేషన్ చేయాలనే డిమాండ్

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** తెలంగాణలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియలో యువత ఎదుర్కొంటున్న ఇబ్బందులు చర్చనీయాంశంగా మారాయి. అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, డిగ్రీ సర్టిఫికెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకం పొందడం తమకు భారంగా మారిందని పలువురు యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ ప్రాంతానికి చెందిన పలువురు యువత ఉపాధి కోసం హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణాలకు వెళ్లి ఉద్యోగాలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఓటరు నమోదుకు అవసరమైన సంతకాల కోసం సొంత గ్రామాలకు వచ్చి, అధికారుల వద్దకు వెళ్లడం సమయం, డబ్బు వృథా కావడంతో పాటు ఉద్యోగ విధులకు కూడా ఆటంకం కలిగిస్తోందని వారు చెబుతున్నారు.




### ఆన్‌లైన్ దరఖాస్తు చేసినా తప్పని తిప్పలు..

ఫారం-18ను ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలతో దరఖాస్తు చేసినప్పటికీ డిగ్రీ సర్టిఫికెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకం కోరడం ఇబ్బందికరంగా మారిందని యువత పేర్కొంటున్నారు. సంతకం పొందిన అనంతరం సంబంధిత బీఎల్‌ఓలకు ధ్రువీకరించిన కాపీని అందజేయడం కూడా కష్టంగా ఉంటోందని అంటున్నారు. చదువుకుని డిగ్రీ పట్టా పొందిన తాము నిజంగా పట్టభద్రులమేనని నిరూపించుకోవడానికి మళ్లీ అధికారుల సంతకాల కోసం తిరగాల్సి రావడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

### ఇంటి వద్దే ధ్రువీకరణ చేపట్టాలి..

పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను మరింత సులభతరం చేయాలని యువత కోరుతున్నారు. అవసరమైన వివరాలు, సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో సమర్పించిన అభ్యర్థుల వివరాలను సంబంధిత అధికారులు పరిశీలించి, అవసరమైతే ఇంటి వద్దకే వచ్చి వెరిఫికేషన్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఉద్యోగాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న యువతకు ఇబ్బందులు కలగకుండా సరళమైన విధానాన్ని అమలు చేయాలని కోరుతున్నారు.పట్టభద్రుల ఓటరు నమోదులో అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించేలా అధికారులు స్పందించి, ధ్రువీకరణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని యువత విజ్ఞప్తి చేస్తున్నారు.

# గర్భిణీకి రక్తదానం చేసి మానవత్వం చాటుకున్న శ్రీకర్





**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ 0418 యూనిట్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్యాల శ్రీకర్ మానవత్వాన్ని చాటుకున్నారు. అత్యవసర సమయంలో రక్తం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ గర్భిణీకు సకాలంలో రక్తం అందేలా చర్యలు చేపట్టి ఆమెకు అండగా నిలిచారు. గర్భిణీకు అత్యవసరంగా రక్తం అవసరమని తెలుసుకున్న శ్రీకర్ వెంటనే స్పందించారు. కులమతాలు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా తన యూనిట్ సభ్యులతో సమన్వయం చేసుకుని రక్తదానానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా యూనిట్ సభ్యులు టేకుల అశోక్, దొమ్మటి కైలాష్ రక్తదానం చేసి బాధిత మహిళకు సహకరించారు. ఎవరో తెలియని వ్యక్తి కష్టాన్ని తమ కష్టంగా భావించి సాయం అందించిన శ్రీకర్, రక్తదానం చేసిన యూనిట్ సభ్యుల సేవాభావాన్ని పలువురు అభినందించారు. ఆపద సమయంలో అండగా నిలిచిన బీఆర్ఎస్ యువ నాయకుడు ప్రశాంత్ కళ్లెపెల్లి, హ్యూమన్ రైట్స్ యూనిట్ సభ్యులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

# అమరవీరుల స్మారక ప్రీమియర్ లీగ్ టోర్నీ ప్రారంభం

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరుల స్మారకార్థం బెజ్జూర్ మండల్ ప్రీమియర్ లీగ్ (బీఎంపీఎల్) క్రికెట్ టోర్నీ శనివారం ప్రారంభమైంది. మండలంలోని యువతలో క్రీడా స్ఫూర్తిని నింపడం, గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయాలనే లక్ష్యంతో ఈ టోర్నీని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా తెలంగాణ జావిద్ మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులను స్మరించుకుంటూ వారి పేరిట క్రీడా టోర్నీ నిర్వహించడం అభినందనీయమని



కొనియాడారు. ఇది యువతలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని, దేశభక్తిని నింపుతుందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు కొండ్ర జగ్గా గౌడ్ మాట్లాడుతూ క్రీడలు కేవలం శారీరక దృఢత్వాన్నే కాకుండా మానసిక ఉల్లాసాన్ని, ఒత్తిడిని తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొని తమ గ్రామానికి, మండలానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. బెజ్జూర్ ఉప సర్పంచ్ రాచకొండ ఆదర్శ్ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి ఉంటేనే విజయం సాధ్యమవుతుందని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి పెట్టాలని సూచించారు. బీజేపీ నాయకులు సామల తిరుపతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, సరైన వేదిక లేక వెనుకబడుతున్నారన్నారు. ఇలాంటి మండల్ స్థాయి టోర్నీలు వారి ప్రతిభను వెలికి తీసి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లేందుకు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో దీక్షిత్ ఫర్టిలైజర్స్ ప్రొప్రైటర్ కవ్వాల సాయి, కాంగ్రెస్ నాయకులు కొండ్ర జగ్గా గౌడ్, మండల అధ్యక్షులు శ్రీవర్ధన్, బీజేపీ నాయకులు సామల తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు బూస సారయ్య, అమీరుద్దీన్, నిర్వాహకులు సురేష్ గౌడ్, వైకుంఠం, కాజా శంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి రెజ్లింగ్ లో అచలాపూర్ విద్యార్థినికి కాంస్య పతకం

### ఎస్ జీఎఫ్ అండర్ -17 పోటీల్లో శ్రీవల్లి ప్రతిభ



**ఉద్యమ కెరటం, తాండూర్:** పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో అచలాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కె.శ్రీవల్లి కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల పీడీ సాంబమూర్తి తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మైత్రి గ్రౌండ్‌లో ఈనెల 14 నుంచి 16 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో శ్రీవల్లి అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా పతకం సాధించిన శ్రీవల్లిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.ఉమాదేవి, ఏఏపీసీ చైర్మన్ చిలకమ్మ, సర్పంచ్ మారిశెట్టి స్రవంతి శ్రీనివాస్, ఉప సర్పంచ్ గట్టు సంతోష్ కుమార్, వార్డు సభ్యుడు పాపయ్య, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ బృందం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఓటరు నమోదు దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదులో అసలు విద్యార్హత పత్రాల పరిశీలన తప్పనిసరి
- ఎన్నికల నిబంధనలను పక్కాగా అమలు చేయాలి
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఎస్ఐఆర్ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, విచారణలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో దరఖాస్తుదారుల అసలు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అర్హులను ఓటర్లుగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ ఆర్ఎస్ చిత్రు, సంబంధిత అధికారులు ఆదిలాబాద్ కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఫారం-6, ఫారం-7, ఫారం-8లకు సంబంధించిన దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి, ఎలాంటి పెండింగ్ లేకుండా సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఓటర్ల అర్హతలను ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్ధారించాలని, ఓటర్ల జాబితాలో తప్పులు, డూప్లికేట్ వివరాలు, అనర్హుల పేర్లు చేరకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అవసరమైన ఓటర్లకు నోటీసులు జారీ చేసి సకాలంలో అందజేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందించడంతో పాటు అవసరమైన పత్రాలను స్వీకరించాలని పేర్కొన్నారు. దరఖాస్తులు, విచారణలకు సంబంధించిన రికార్డులను భౌతిక పత్రాల రూపంలో సక్రమంగా నిర్వహించి భద్రపర్చాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు విషయంలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. దరఖాస్తుదారుల అసలు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను పరిశీలించిన అనంతరమే అర్హతను నిర్ధారించాలని, నకిలీ, తప్పుడు పత్రాలు, డూప్లికేట్ దరఖాస్తులను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వానికి ప్రాధాన్యతనిస్తూ అన్ని దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని, ఓటరు నమోదు, జాబితా సవరణలో నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓ జగదీశ్వర్‌రావు, తహశీల్దార్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ నలంద ప్రియ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# దుర్గామాతను దర్శించుకున్న బెల్లంపల్లి ఏరియా జీఎం



**ఉద్యమ కెరటం, తాండూర్:** దుర్గా నవరాత్రుల సందర్భంగా బెల్లంపల్లి ఏరియా వర్క్‌షాప్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియాలో నూతన మైనింగ్ ప్రాజెక్టులు, ఓపెన్‌కాస్ట్ గనులు త్వరగా ప్రారంభం కావాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, ఐఎన్‌టీయూసీ ఏరియా కార్యదర్శి బూర శ్రీనివాస్, వర్క్‌షాప్ కార్యదర్శి కందుల తిరుపతి, జీఎం కార్యాలయ పిట్ కార్యదర్శి కె.భీమేష్, నాయకులు సత్యనారాయణ, పోశం, రాజేష్, ఏఐటీయూసీ నాయకుడు కోడెం అశోక్, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, వర్క్‌షాప్ అధికారి జ్ఞానేశ్వర్, నరేష్, ఏరియా ఇంజనీర్ వీరన్న, కైరిగూడ ప్రాజెక్టు అధికారి ఎం.నరేందర్, మేనేజర్ శంకర్, ఏరియా సర్వే అధికారి వినోద్ కుమార్, జీఎం కార్యాలయంలోని వివిధ విభాగాల అధికారులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

- డివిజన్-3 జనరల్ సెక్రటరీగా ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ

**ఉద్యమ కెరటం, జవహర్‌నగర్:** డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, కాంగ్రెస్ పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని జవహర్‌నగర్ డివిజన్-3 కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్‌నగర్ డివిజన్-3 కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయి కమిటీ నియామకాల్లో భాగంగా సీనియర్ నాయకుడు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనపై నమ్మకంతో జనరల్ సెక్రటరీ బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి, మాజీ మేయర్‌కు, డివిజన్ అధ్యక్షుడు దొంతగాని శాంతి కొటేష్ గౌడ్‌కు, పార్టీ సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో, క్రమశిక్షణతో నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. జవహర్‌నగర్ డివిజన్-3 పరిధిలోని ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ప్రజలకు మరింత చేరువగా ఉంటూ ప్రజాసేవే లక్ష్యంగా



పనిచేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బల్లి శ్రీనివాస్, కొలిపాక సాయికిరణ్, కన్నబోయిన రాజు యాదవ్, గండి సునీత, రేణుక, నాచారం కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# ముంబై ఇండియన్స్‌కు కొత్త కోచ్!

**ముంబై, అక్టోబరు 17 :** ఐపీఎల్‌లో ఐదుసార్లు టైటిల్ సాధించిన ముంబై ఇండియన్స్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. జట్టు ప్రధాన కోచ్ మహేల జయవర్ధనేతో తన ప్రయాణాన్ని ముగించుకోవాలని ఫ్రాంచైజీ నిర్ణయించినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అయితే ఈ మార్పుపై అధికారిక ప్రకటనను ధ్రువీకరించాల్సి ఉంది. గత ఐపీఎల్ సీజన్‌లో ముంబై ఇండియన్స్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. జట్టు ప్రదర్శనలో నిలకడ లేకపోవడం, ఆటగాళ్ల గాయాలు, కొందరు కీలక ఆటగాళ్లు అందుబాటులో లేకపోవడం వంటి అంశాలు ఫలితాలపై ప్రభావం చూపినట్లు కథనాలు వెలువడ్డాయి. డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలు ఉన్నాయన్న వార్తలు కూడా అప్పట్లో చర్చకు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాబోయే సీజన్ కోసం కొత్త ప్రధాన కోచ్‌ను నియమించే అంశంపై ఫ్రాంచైజీ దృష్టి సారించినట్లు సమాచారం. కొత్త కోచ్ ఎంపిక కోసం పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే తదుపరి కోచ్ ఎవరనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. మహేల జయవర్ధనేకు ముంబై ఇండియన్స్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. 2017లో జట్టు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన మార్గదర్శకత్వంలో ముంబై 2017, 2019, 2020 సీజన్లలో ఐపీఎల్ టైటిళ్లు గెలుచుకుంది. దీంతో ఫ్రాంచైజీ విజయాల్లో కీలక పాత్ర పోషించిన కోచ్‌లలో ఆయన ఒకరిగా గుర్తింపు పొందాడు. జట్టు ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది, అభిమానులతో కలిసి ఎన్నో మధుర జ్ఞాపకాలను సృష్టించుకున్నామని జయవర్ధనే పేర్కొన్నట్లు సమాచారం. తనపై నమ్మకం ఉంచిన నీతా అంబానీ, ఆకాశ్ అంబానీలకు కృతజ్ఞతలు తెలిపినట్లు కథనాలు వెల్లడించాయి. ముంబై ఇండియన్స్‌కు జయవర్ధనే అందించిన సేవలను నీతా అంబానీ ప్రశంసించినట్లు సమాచారం. ఆయన ఎప్పటికీ తమ 'వన్ ఫ్యామిలీ'లో భాగమేనని ఆమె పేర్కొన్నట్లు కథనాలు తెలిపాయి. కోచ్‌గా ఆయన సాధించిన విజయాలు, జట్టుతో ఏర్పరచుకున్న అనుబంధం ముంబై ఇండియన్స్ ప్రయాణంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి. కొత్త కోచ్ ఎంపికపై అధికారిక ప్రకటన వెలువడితేనే జట్టు తదుపరి ప్రణాళికలపై స్పష్టత రానుంది.

# ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ కోచ్‌గా చమిందా వాస్!

**న్యూఢిల్లీ, అక్టోబరు 17 :** ఐపీఎల్ తదుపరి సీజన్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్ తన కోచింగ్ బృందాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది. శ్రీలంక మాజీ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ చమిందా వాస్‌ను జట్టు బౌలింగ్ కోచ్‌గా నియమించినట్లు ప్రకటించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో తనదైన ముద్ర వేసిన వాస్ అనుభవం జట్టు పేస్ విభాగానికి ఉపయోగపడుతుందని ఫ్రాంచైజీ భావిస్తోంది. చమిందా వాస్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోని మిచెల్ స్టార్క్, లుంగి ఎంగిడి, ముకేశ్ కుమార్, దుష్మంత చమీర వంటి పేసర్లతో కలిసి పనిచేయనున్నారు. ఎడమచేతి వేగంతో పాటు బంతిని స్వింగ్ చేయడంలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన వాస్, బౌలర్లకు సాంకేతికంగా మెరుగైన శిక్షణ అందించగలరు. మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా బౌలింగ్ వ్యూహాలను రూపొందించడంలోనూ ఆయన అనుభవం జట్టుకు తోడ్పడే అవకాశం ఉంది. శ్రీలంక తరఫున సుదీర్ఘకాలం ఆడిన చమిందా వాస్ మూడు ఫార్మాట్లలో కలిపి 439 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడినట్లు గణాంకాలు చెబుతున్నాయి. టెస్టుల్లో 355 వికెట్లు, వన్డేల్లో 400 వికెట్లు సాధించారు. బంతిని స్వింగ్ చేస్తూ కీలక సమయాల్లో వికెట్లు తీయడంలో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్ వంటి భారత బ్యాటర్లకు కూడా ఆయన పలుమార్లు సవాలు విసిరారు. ఆటగాడిగా ఐపీఎల్‌లోనూ వాస్‌కు అనుభవం ఉంది. డెక్కన్ ఛార్జర్స్ తరఫున ఆడిన ఆయన, లీగ్‌లో తన బౌలింగ్ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఆటగాడిగా సంపాదించిన అనుభవంతో పాటు కోచ్‌గా పనిచేసిన పరిజ్ఞానం ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ విభాగానికి ఉపయోగపడనుంది. ఈ నియామకంతో రాబోయే సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ పేస్ బౌలింగ్ మరింత పటిష్ఠం కావాలని అభిమానులు ఆశిస్తున్నారు. అయితే జట్టు ప్రదర్శనపై ఈ మార్పు ఎలాంటి ప్రభావం చూపుతుందో సీజన్ ప్రారంభమైన తర్వాతే స్పష్టమవుతుంది.



# అంతర్జాతీయ క్రీడా టోర్నీలకు 50 కోట్ల సాయం!

**న్యూఢిల్లీ, అక్టోబరు 17 :** దేశంలో అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సహాయ పథకాన్ని ప్రకటించినట్లు సమాచారం. అంతర్జాతీయ వేదికలపై భారత క్రీడాకారుల ప్రతిభను మెరుగుపరచడంతో పాటు, దేశాన్ని ప్రపంచ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దడం ఈ పథకం లక్ష్యంగా పేర్కొన్నారు. ఇందులో భాగంగా, దేశంలో అంతర్జాతీయ టోర్నీలు నిర్వహించే జాతీయ క్రీడా సమాఖ్యలకు పోటీల స్థాయిని బట్టి గరిష్ఠంగా రూ.50 కోట్ల వరకు ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ పథకం కింద వివిధ క్రీడా విభాగాలకు వాటి అంతర్జాతీయ ప్రాధాన్యం, సాధించిన విజయాలు, పోటీల స్థాయిని బట్టి ఆర్థిక సాయం కేటాయించనున్నట్లు సమాచారం. ఒలింపిక్స్ లేదా ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో పతకాలు సాధించిన క్రీడలకు సంబంధించిన అంతర్జాతీయ పోటీల నిర్వహణకు గరిష్ఠంగా రూ.50 కోట్ల వరకు అందించే అవకాశం ఉంది. అంతర్జాతీయ స్థాయిలో టాప్-16 ర్యాంకింగ్స్‌లో ఉన్న క్రీడలకు రూ.20 కోట్లు, అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించిన ఇతర క్రీడలకు రూ.10 కోట్ల వరకు సాయం అందించనున్నట్లు కథనంలో పేర్కొన్నారు. అయితే ఈ మొత్తాలు, అర్హత ప్రమాణాలను సంబంధిత అధికారిక మార్గదర్శకాలతో ధ్రువీకరించాల్సి ఉంది. ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన లేదా పాల్గొనే ఒలింపిక్ క్రీడా విభాగాలకు సంబంధించిన పోటీల నిర్వహణకు గరిష్ఠంగా రూ.20 కోట్ల వరకు ఆర్థిక సాయం అందించనున్నట్లు సమాచారం. ఈ నిధులు అంతర్జాతీయ పోటీలను దేశంలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లకు ఉపయోగపడనున్నాయి. ఈ ఆర్థిక సాయంతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా క్రీడా ప్రాంగణాలను సిద్ధం చేయడం,



పోటీదారులకు మెరుగైన వసతి, రవాణా, వైద్య సదుపాయాలు కల్పించడం వంటి ఏర్పాట్లకు అవకాశం ఉంటుంది. అంతర్జాతీయ టోర్నీల నిర్వహణ పెరిగితే భారత క్రీడాకారులకు స్వదేశంలోనే ప్రపంచ స్థాయి ఆటగాళ్లతో పోటీపడే అవకాశం లభిస్తుంది. అలాగే, క్రీడా రంగానికి సంబంధించిన మౌలిక సదుపాయాలు, నిర్వహణ నైపుణ్యాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. అయితే పథకం అమలు, నిధుల మంజూరు, అర్హత ప్రమాణాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటనను పరిశీలించాల్సి ఉంది.

# జైస్వాల్‌కు అన్యాయం చేశారు: అశ్విన్

**న్యూఢిల్లీ, అక్టోబరు 17 :** న్యూజిలాండ్ పర్యటన కోసం ప్రకటించిన భారత వన్డే జట్టులో యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు చోటు దక్కకపోవడంపై మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. వరుసగా పరుగులు సాధించే సత్తా ఉన్న ఆటగాడికి తగిన అవకాశాలు కల్పించకపోవడం సరికాదని అభిప్రాయపడ్డాడు. ఇలాగే కొనసాగితే జైస్వాల్ ఆత్మవిశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించాడు. న్యూజిలాండ్ వన్డే సిరీస్‌కు ప్రకటించిన జట్టులో జైస్వాల్‌కు చోటు దక్కకపోవడాన్ని అశ్విన్ తప్పుబట్టాడు. శుభ్‌మన్ గిల్ అందుబాటులో లేని పరిస్థితి ఎదురైతే అతడి స్థానంలో జైస్వాల్‌కు అవకాశం ఇవ్వాల్సిందని అభిప్రాయపడ్డాడు. ప్రతిభ ఉన్న ఆటగాళ్లకు అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడే అవకాశాలు కల్పించడం జట్టు యాజమాన్యం, సెలెక్టర్ల బాధ్యతని పేర్కొన్నాడు. జైస్వాల్ గతంలో పరుగుల వరద పారించిన ఆటగాడని గుర్తుచేస్తూ, ప్రస్తుతం అతడికి తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ లభించడం లేదని అశ్విన్



ఆందోళన వ్యక్తం చేశాడు. కేవలం అవకాశాల కోసం మాట్లాడటం లేదని, ఆటగాడి ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తు దృష్ట్యా ఈ విషయం ముఖ్యమని వివరించాడు. గత రెండేళ్లలో జైస్వాల్ బ్యాటింగ్‌లో కొన్ని మార్పులు కనిపిస్తున్నాయని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. అతడు తిరిగి తనదైన లయను అందుకోవాలంటే తగినంత మ్యాచ్ సమయం, జట్టు మద్దతు అవసరమని చెప్పాడు. టెస్టు క్రికెట్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని అంగీకరిస్తూనే, ఇతర ఫార్మాట్లలోనూ ఆడే అవకాశాలు కల్పించాలని సూచించాడు. జైస్వాల్ చివరిసారిగా ఎప్పుడు వన్డే, టీ20 మ్యాచ్‌లు ఆడాడనే విషయాన్ని కూడా అశ్విన్ ప్రస్తావించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడే అవకాశం ఆటగాడికి ఎంతో విలువైనదని పేర్కొన్నాడు. తాను సెలెక్షన్ కమిటీలో ఉండి ఉంటే జైస్వాల్‌ను పిలిచి, రెండు మ్యాచ్‌ల్లో ఆడే అవకాశం ఇస్తే సిద్ధంగా ఉన్నావా? అని అడిగేవాడినని అశ్విన్ వ్యాఖ్యానించాడు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం కంటే గొప్పది మరొకటి లేదని అభిప్రాయపడ్డాడు. యువ ఆటగాళ్ల ప్రతిభను గుర్తించి, వారికి తగిన అవకాశాలు కల్పించడం ద్వారా జట్టు భవిష్యత్తును బలోపేతం చేయవచ్చన్నది అశ్విన్ వ్యాఖ్యల సారాంశం. జైస్వాల్‌కు రాబోయే రోజుల్లో ఏ ఫార్మాట్‌లో అవకాశాలు లభిస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

# కోహ్లీని అహంకారి అనుకున్నా..




**న్యూఢిల్లీ, అక్టోబరు 17 :** టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ వ్యక్తిత్వంపై దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు ఏబీ డివిలియర్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కోహ్లీని తొలిసారి కలిసినప్పుడు అతడిని అహంకారిగా భావించానని వెల్లడించాడు. అయితే, అది అహంకారం కాదని, తన సామర్థ్యంపై కోహ్లీకి ఉన్న బలమైన నమ్మకమే అలా కనిపించడానికి కారణమని వివరించాడు. వయసు పెరిగే కొద్దీ కోహ్లీలో వ్యక్తిత్వ పరంగా ఎంతో పరిణతి వచ్చిందని పేర్కొన్నాడు. ప్రఖర్ గుప్తాతో జరిగిన పాడ్‌కాస్ట్‌లో డివిలియర్స్ ఈ విషయాలను పంచుకున్నాడు. కోహ్లీని మొదటిసారి కలిసినప్పుడు అతడిని నిజంగానే అహంకారిగా, పొగరుబోతుగా భావించారా? అని అడగ్గా.. అవునని సమాధానమిచ్చాడు. ఈ విషయం కోహ్లీకి కూడా తెలుసని, తాను ఈ వ్యాఖ్యలను సరదాగానే చెబుతుంటానని వివరించాడు. 19 నుంచి 21 ఏళ్ల వయసులో కోహ్లీ ఎంతో ఆత్మవిశ్వాసంతో ఉండేవాడని డివిలియర్స్ తెలిపాడు. తన సామర్థ్యంపై అతడికి గట్టి నమ్మకం ఉండేదని, అదే కొన్నిసార్లు ఇతరులకు అహంకారంలా కనిపించేదని చెప్పాడు. ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే ఆటగాడికి తనపై తనకు నమ్మకం ఉండటం చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున కలిసి ఆడిన కోహ్లీ, డివిలియర్స్ మధ్య మంచి స్నేహం ఏర్పడింది. మైదానంలో భాగస్వామ్యాలతో పాటు మైదానం బయట కూడా వీరిద్దరి అనుబంధం కొనసాగింది. దీంతో కోహ్లీ ఆటతీరును, వ్యక్తిత్వాన్ని దగ్గరగా గమనించే అవకాశం డివిలియర్స్‌కు లభించింది. కాలక్రమంలో కోహ్లీలో ఎంతో మార్పు వచ్చిందని డివిలియర్స్ పేర్కొన్నాడు. చిన్న వయసులో తనను తాను నిరూపించుకోవాలనే తపన ఎక్కువగా ఉండేదని, విజయాలు సాధిస్తూ ముందుకు సాగిన కొద్దీ ఆ అవసరం తగ్గిందని వివరించాడు. ప్రస్తుతం కోహ్లీ వ్యక్తిగా, క్రికెటర్‌గా మరింత పరిణతి సాధించాడని తెలిపాడు. డివిలియర్స్ వ్యాఖ్యలు కోహ్లీ కెరీర్‌లోని ఎదుగుదలను, ఆత్మవిశ్వాసం నుంచి పరిణతి వైపు సాగిన అతడి ప్రయాణాన్ని మరోసారి చర్చకు తీసుకొచ్చాయి.

# వైభవ్ పోస్ట్ వైరల్.. తుది టీ20లో ఛాన్స్ దక్కేనా?

**బెంగళూరు, అక్టోబరు 17:** భారత్, వెస్టిండీస్ మధ్య టీ20 సిరీస్ తుది పోరుపై ఆసక్తి నెలకొంది. ఇరు జట్లు చెరో రెండు విజయాలతో సమంగా నిలవడంతో చివరి మ్యాచ్ సిరీస్ విజేతను నిర్ణయించనుంది. ఈ కీలక సమయంలో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ సామాజిక మాధ్యమాల్లో పెట్టిన ఓ పోస్టు చర్చకు దారితీసింది. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే అవకాశం రాని వైభవ్.. చివరి టీ20లోనైనా బరిలోకి దిగుతాడా అన్న ఉత్కంఠ అభిమానుల్లో పెరిగింది. భారత జట్టులో చోటు దక్కించుకున్న వైభవ్ సూర్యవంశీ తొలి నాలుగు మ్యాచ్‌ల్లోనూ బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఓపెనర్లుగా సంజు శాంసన్, అభిషేక్ శర్మలకు జట్టు యాజమాన్యం ప్రాధాన్యం ఇవ్వడంతో అతడికి తుది జట్టులో అవకాశం రాలేదు. ఈ నేపథ్యంలో వైభవ్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో 'స్టిల్ బిలీవింగ్' అనే అర్థం వచ్చేలా పోస్టు పెట్టినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. అంటే, 'ఇప్పటికీ నమ్మకంతోనే ఉన్నా' అనే భావం. ఈ పోస్టుతో చివరి మ్యాచ్‌లో అతడికి అవకాశం దక్కుతుందా? అనే చర్చ మొదలైంది. అయితే ఈ పోస్టు జట్టు ఎంపికకు సంబంధించినదేనని నిర్ధారించలేం. సిరీస్ విజయం కోసం భారత్ చివరి మ్యాచ్‌లో బరిలోకి దిగనుంది. ఇలాంటి కీలక పోరులో జట్టు యాజమాన్యం ఓపెనింగ్ జోడీని మారుస్తుందా? లేక ఇప్పటికే ఆడుతున్న ఆటగాళ్లకే మరో అవకాశం ఇస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ గతంలో జట్టు ఎంపికలో ఆటగాళ్ల ఫామ్‌తో పాటు జట్టు సమతూకం, వ్యూహాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పినట్లు కథనాలు వెల్లడించాయి. అందువల్ల వైభవ్ మంచి ప్రతిభ కలిగిన ఆటగాడైనా, తుది జట్టులో చోటు దక్కడం ఖాయమని చెప్పలేం. వైభవ్ సూర్యవంశీ అరంగేట్రంపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో జట్టు యాజమాన్యం ఎలాంటి కూర్పుతో బరిలోకి దిగుతుందనేది టాస్ సమయంలోనే స్పష్టమవుతుంది. వైభవ్‌కు అవకాశం ఇస్తారా? లేక ప్రస్తుత ఓపెనింగ్ జోడీనే కొనసాగిస్తారా? అన్నది వేచి చూడాలి.





# యోధురాలిగా సాయిపల్లవి..

## 'రామాయణం' ప్రోమోపై ఆసక్తి!

**హైదరాబాద్, అక్టోబరు 17 :** నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణం' మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ సినిమాలో సీతాదేవిగా నటిస్తున్న సాయిపల్లవి చేతిలో కత్తితో యోధురాలి రూపంలో కనిపిస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీశాయి. ఈ కొత్త ప్రచార చిత్రంలో సీత పాత్రను విభిన్నంగా చూపించారంటూ అభిమానులు ఆసక్తి వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా వెండితెరపై సీతాదేవి పాత్రను సహనం, త్యాగం, కుటుంబ విలువలకు ప్రతీకగా చూపిస్తుంటారు. అయితే ఈ చిత్రంలో ఆమె ధైర్యసాహసాలను కూడా ఆవిష్కరించేలా రూపకల్పన చేసినట్లు ప్రచార చిత్రంలోని దృశ్యాలు సూచిస్తున్నాయి. చేతిలో కత్తితో యోధురాలిగా సాయిపల్లవి కనిపించడం సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, యశ్ రావణుడిగా, సాయిపల్లవి సీతాదేవిగా నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్, హాన్స్ జిమ్మర్ సంగీత బాధ్యతలు చేపట్టినట్లు సమాచారం. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం ప్రణాళిక రూపొందించింది. 'రామాయణం' విడుదల తేదీ, తాజా ప్రచార చిత్రానికి సంబంధించిన వివరాలపై అధికారిక ప్రకటనలను పరిశీలించాల్సి ఉంది. ముఖ్యంగా నవంబర్ 5న దీపావళి సందర్భంగా తొలి భాగం విడుదల కానుందన్న ప్రచారానికి అధికారిక ధృవీకరణ అవసరం. సీతాదేవి పాత్రలో సాయిపల్లవి కనిపించనున్న తీరు మాత్రం అభిమానుల్లో ఇప్పటికే ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# ఆడిషన్ లేకుండానే..

**హైదరాబాద్, అక్టోబరు 17 :** ఇతర భాషల నుంచి వచ్చి టాలీవుడ్‌లో అవకాశాలు దక్కించుకోవడం అంత సులభం కాదు. ముఖ్యంగా తెలుగు భాష తెలియని సమయంలో ఆడిషన్స్‌కు హాజరవడం నటీనటులకు సవాలుతో కూడుకున్నదే. అయితే మలయాళ నటి అనశ్వర రాజన్‌కు మాత్రం తన తొలి తెలుగు సినిమా విషయంలో ఓ ఆసక్తికరమైన అనుభవం ఎదురైంది. 'ఛాంపియన్' సినిమా కోసం ఆడిషన్‌కు వెళ్లినప్పుడు తనను ఎంపిక చేయలేదని భావించానని, చివరకు ఆడిషన్ అవసరం లేకుండానే అవకాశం దక్కిందని ఆమె గుర్తుచేసుకుంది. 'ఛాంపియన్' సినిమా కోసం 2024 ఏప్రిల్‌లో చిత్ర నిర్మాణ సంస్థ నుంచి తనకు ఫోన్ వచ్చిందని అనశ్వర రాజన్ తెలిపింది. ఆ తర్వాత నిర్వహించిన లుక్ టెస్ట్ కోసం హాఫ్ శారీ ధరించి వెళ్లినట్లు వెల్లడించింది. అక్కడ నిర్మాత సాయి, సహాయ దర్శకుడు తనకు కొన్ని సంభాషణలతో కూడిన స్క్రిప్ట్ ఇచ్చి సాధన చేయాలని సూచించారట. తనకు తెలుగు రాదని చెప్పడంతో, ఆంగ్లంలోనే సంభాషణలు చెప్పవచ్చని వారు భరోసా ఇచ్చినట్లు అనశ్వర తెలిపింది. దీంతో అక్కడే డైలాగ్స్ సాధన చేస్తూ ఆడిషన్‌కు సిద్ధమైంది. దర్శకుడు ప్రదీప్ అద్వైతం కూడా అక్కడే ఉన్నారని ఆమె గుర్తుచేసుకుంది. అనశ్వర సంభాషణలు సాధన చేస్తున్న సమయంలో స్వప్న దత్ అక్కడికి వచ్చి ఆమెను చూసి ఓకే అని చెప్పి వెళ్లిపోయారట. ఆ తర్వాత దర్శకుడు ప్రదీప్ అద్వైతం, నిర్మాత సాయి సహా అక్కడున్నవారంతా వెళ్లిపోయారు. కొద్దిసేపటికి తిరిగి వచ్చిన నిర్మాత సాయి.. ఆడిషన్ అవసరం లేదని, ఇక సంభాషణలు చెప్పాల్సిన పని లేదని చెప్పారట. దీంతో అనశ్వర అయోమయానికి గురైందట. తనను ఎంపిక చేయలేదని, సినిమా నుంచి తప్పించేశారని భావించి ఇంటికి వెళ్లిపోవచ్చని అనుకుందట. కారణం ఏమిటని పదేపదే అడిగినా, ఆడిషన్ అవసరం లేదనే సమాధానమే రావడంతో అసలు విషయం అర్థం కాలేదని ఆమె వెల్లడించింది. చివరకు తనను ఎంపిక చేసినందువల్లే ఆడిషన్ అవసరం లేదని తెలుసుకున్న అనశ్వర ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తిరస్కరణ ఎదురైందని భావించిన సమయంలోనే సినిమా అవకాశం దక్కిందని తెలిసి ఎంతో సంతోషించానని ఆమె తెలిపింది. మలయాళ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న అనశ్వర రాజన్, 'ఛాంపియన్'తో తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యే ప్రయత్నం చేస్తోంది. తన తొలి తెలుగు సినిమా ఎంపిక వెనుక ఉన్న ఈ అనుభవం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.





# విధి, వినోదం మధ్య గీత ఎక్కడ?



**హైదరాబాద్, అక్టోబరు 17 :** పోలీసు యూనిఫామ్ అనేది కేవలం దుస్తులు కాదు.. అది ప్రజలకు భరోసా ఇచ్చే బాధ్యతకు, చట్టాన్ని అమలు చేసే అధికారానికి, క్రమశిక్షణకు ప్రతీక. పండుగలు, ఉత్సవాలు ప్రజల జీవితాల్లో ఆనందాన్ని నింపుతాయి. అలాంటి సందర్భాల్లో పోలీసులూ మానవీయ భావాలతో ప్రజలతో మమేకం కావడం సహజమే. అయితే, యూనిఫామ్‌లో ఉన్నప్పుడు వ్యక్తిగత ఆనందానికి, విధి బాధ్యతలకు మధ్య స్పష్టమైన సమతుల్యత అవసరం. ఈ అంశమే తెలంగాణలో గణేశ్ నిమజ్జన వేడుకల సందర్భంగా పోలీసు సిబ్బంది నృత్యాలు చేసిన వీడియోల నేపథ్యంలో చర్చనీయాంశంగా మారింది. 2026 సెప్టెంబర్ 25న హైదరాబాద్‌లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన ఊరేగింపు సందర్భంగా కొందరు పోలీసు అధికారులు, సిబ్బంది భక్తులతో కలిసి నృత్యం చేసిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. ఈ వేడుకల్లో ఖైరతాబాద్ డీసీపీ కె. శిల్పవల్లి కూడా భక్తులతో కలిసి నృత్యం చేసినట్లు తెలంగాణ టుడే వార్తా కథనం పేర్కొంది. ఈ దృశ్యాలపై కొందరు నెటిజన్లు పోలీసుల కష్టానికి అభినందనలు తెలపగా, మరికొందరు యూనిఫామ్ హుందాతనం, విధి నిర్వహణలో వృత్తిపరమైన ప్రవర్తనపై ప్రశ్నలు లేవనెత్తారు. అంటే, ఈ ఘటనపై ప్రజల అభిప్రాయాలు ఏకరీతిగా లేవు. అయితే, వీడియోలు వైరల్ కావడం ఒక్కటే క్రమశిక్షణా ఉల్లంఘన జరిగినట్లు నిరూపించదు. ఘటన జరిగిన సందర్భం, సిబ్బంది అప్పటి బాధ్యతలు, శాఖా నిబంధనలు కూడా పరిశీలించాల్సిందే. ఈ పరిణామాల నేపథ్యంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ యూనిఫామ్ ధరించి ప్రైవేట్ కార్యక్రమాలు, వినోద కార్యక్రమాల్లో పాల్గొనడంపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు 2026 అక్టోబర్ 16, 17 తేదీల్లో పలు సంస్థలు నివేదించాయి. యూనిఫామ్‌లో నృత్యాలు చేయడం, ప్రైవేట్ వేడుకల్లో పాల్గొనడం వంటి చర్యలను నివారించాలని, ఆదేశాలను ఉల్లంఘిస్తే క్రమశిక్షణా చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించినట్లు కథనాలు పేర్కొన్నాయి. అయితే, ఈ ఆదేశాలకు సంబంధించిన పూర్తి అధికారిక ఉత్తర్వు, దాని ఖచ్చితమైన పరిధి అందుబాటులో ఉన్న వార్తా కథనాల ద్వారా పూర్తిగా నిర్ధారించబడలేదు. అందువల్ల, ఆదేశాల అమలు, అధికారిక సాంస్కృతిక కార్యక్రమాలకు వర్తించే విధానం వంటి అంశాలపై శాఖ నుంచి స్పష్టత రావడం అవసరం. పోలీసులు పండుగల సమయంలో శాంతిభద్రతలు కాపాడేందుకు, ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు, భారీ జనసమూహాలను నిర్వహించేందుకు గంటల తరబడి విధులు నిర్వర్తిస్తారు. గణేశ్ నిమజ్జనం వంటి భారీ కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిసినప్పుడు వారి కృషిని అభినందించడం సమంజసమే. అదే సమయంలో, విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది ప్రజల భద్రతపై నిరంతరం దృష్టి సారించాలి. ఏదైనా నృత్యం వల్ల విధులకు ఆటంకం కలిగిందా? ప్రజల భద్రతకు సంబంధించిన బాధ్యతలు నిర్లక్ష్యానికి గురయ్యాయా? సంబంధిత శాఖా నిబంధనలు ఉల్లంఘించబడ్డాయా? అనే ప్రశ్నలకు ఆధారాలతో సమాధానాలు వెతకాలి. నిర్ధారణలేని ఆరోపణలతో వ్యక్తులను విమర్శించడం కంటే, వాస్తవాల ఆధారంగా వ్యవస్థ పనితీరును సమీక్షించడం ప్రజాస్వామ్యబద్ధమైన విధానం. పోలీసు శాఖ గౌరవం కేవలం యూనిఫామ్‌లోనే ఉండదు; ప్రజలతో వ్యవహరించే తీరు, బాధ్యతల పట్ల నిబద్ధత, నిబంధనల అమలులో నిష్పాక్షికతలోనూ ప్రతిబింబిస్తుంది. పండుగల ఆనందాన్ని గౌరవిస్తూనే, యూనిఫామ్ వినియోగం, విధి నిర్వహణ, అధికారిక వేడుకలు, వ్యక్తిగత కార్యక్రమాల విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలి. నిబంధనలు అందరికీ ఒకే విధంగా అమలవుతున్నాయనే విశ్వాసం కూడా ప్రజల్లో కలగాలి. పోలీసు సిబ్బంది కృషిని గుర్తించడం ఎంత అవసరమో, వృత్తిపరమైన క్రమశిక్షణను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం. అంతిమంగా, ఖాకీ గౌరవం కాపాడబడినప్పుడే ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది.



## జర్నలిస్ట్ రఘు అకాల మృతి
# తీరని లోటు

## టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ

**ఉద్యమ కెరటం, హైదరాబాద్:** తన ఆప్తమిత్రుడు, సీనియర్ పాత్రికేయుడు, ఆర్ ఎన్ ఏ మీడియా సంస్థ చీఫ్ ఎడిటర్ అవ్వారి రఘు అకాల మృతి మీడియా రంగానికి తీరని లోటని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే ) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అన్నారు. శనివారం నాడు కోకాపేట లోని రఘు నివాసంలో మృతదేహాన్ని ఆయన సందర్శించి నివాళి అర్పించారు. రఘుతో తనకు మూడు దశాబ్దాల బంధం ఉందని, సాదాసీదా వ్యక్తిత్వం కలిగి ఉన్న ఆయన ఏ సంస్థలో పనిచేసినా, వృత్తి పట్ల తన నిబద్ధతను, అంకితభావాన్ని ప్రదర్శించేవారని విరాహత్ గుర్తుచేసారు. ఈ సందర్భంగా రఘు కుటుంబాన్ని ఆయన ఓదార్చారు.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# హత్నూరలో బతుకమ్మ వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు



**ఉద్యమ కెరటం, హత్నూర:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండల కేంద్రంలో బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. శనివారం గ్రామ సర్పంచ్ నల్లొల్ల ఎల్లయ్య, ఉప సర్పంచ్ చెక్క మానస రవీందర్ గౌడ్, గ్రామపంచాయతీ కార్యదర్శితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా చాకిచెరువు రహదారితో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పండుగ సమయంలో మహిళలకు అసౌకర్యం కలగకుండా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించేందుకు దృష్టి సారించినట్లు తెలిపారు. మహిళలు, గ్రామ ప్రజలు బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాల మధ్య ప్రశాంతంగా జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని సర్పంచ్ పేర్కొన్నారు. పండుగ సందర్భంగా పారిశుధ్యానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పండుగ శేఖర్, బాలు, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు



**ఉద్యమ కెరటం, హత్నూర:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో బతుకమ్మ పండుగ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ ఫర్హీన్ షేక్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సాంప్రదాయ ఆటపాటలతో సందడి చేశారు. ఈ వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచులకు ఎంతో ప్రత్యేకమైనదని తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రతిఒక్కరూ బతుకమ్మ పండుగను ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బతుకమ్మ నిమజ్జనం కోసం చెరువుల వద్దకు వెళ్లే రహదారులు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని గ్రామ సర్పంచులకు సూచించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 23న కుమ్రంభీం కాంస్య విగ్రహావిష్కరణ



**ఉద్యమ కెరటం, జైనూర్:** ఆదివాసీ అమరవీరుడు కుమ్రంభీం కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈనెల 23న ఇంద్రవెల్లిలో నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్, ఆహ్వాన పత్రాలను శనివారం జైనూర్ మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ మార్కెట్ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్, వివిధ రాయిసెంటర్ల సార్మేడీలు, సర్పంచులు, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మధురాజ్ మడావిని కలిసి కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానించారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆదివాసీ అమర వీరుడు కుమ్రంభీం ఆశయ సాధనకు ప్రతీకగా, చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఇంద్రవెల్లిలో కాంస్య విగ్రహావిష్కరణ, ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆదివాసీ నాయకులు, యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూర్కా భాపురావ్, విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు, తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూర్కా చిత్రు, గిన్నెరా ఉపసార్మేడి మెస్రం లక్ష్మణ్, జైనూర్ మండల నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ చీరెలే లక్ష్మణ్, మెస్రం శేకు, మెస్రం అంబాజీరావు, మార్లవాయి సార్మేడి గేడం గణపత్, లేండిజాల సార్మేడి మెస్రం భాదిరావు, జైనూర్ సర్పంచ్ కొడప ప్రకాష్, ధానోరా సర్పంచ్ మెస్రం భూపతి, డబోలి సర్పంచ్ మెస్రం నగేష్, భూసిమెట్ట సర్పంచ్ ఆత్రం నగేష్, ఆదివాసీ విద్యార్థి సంఘం సిర్పూర్ మండల ప్రధాన కార్యదర్శి ఆత్రం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రామరాజ్యమే ఇందిరమ్మ రాజ్యం.. నేటి ప్రజాపాలనే దానికి నిదర్శనం

- **ఇందిరమ్మ 20 సూత్రాల స్ఫూర్తితో ఆరు గ్యారంటీల అమలు**
- **బోథ్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్**



**ఉద్యమ కెరటం, బోథ్:** నాడు ఇందిరా గాంధీ పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం లక్ష్యంగా ప్రవేశపెట్టిన 20 సూత్రాల కార్యక్రమం స్ఫూర్తితోనే నేడు తెలంగాణలో ప్రజాపాలన కొనసాగుతోందని బోథ్ కాంగ్రెస్ ఇన్‌చార్జి, ఆర్జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆడే గజేందర్ పేర్కొన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువత, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ 20 సూత్రాల కార్యక్రమంలోని ప్రధాన లక్ష్యాలను బోథ్ నియోజకవర్గ ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆడే గజేందర్ కృషి చేస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి. పేదరిక నిర్మూలన, గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం, ఉపాధి కల్పన, అందరికీ ఇళ్లు, సురక్షిత తాగునీరు, వైద్య సదుపాయాలు, విద్యాభివృద్ధి వంటి అంశాలు ఈ కార్యక్రమంలో కీలకమైనవని తెలిపారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సామాజిక న్యాయం, మహిళలకు సమాన అవకాశాలు, యువతకు నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ మౌళిక వసతుల కల్పన, పర్యావరణ పరిరక్షణ, విద్యుద్దీకరణ, కుటుంబ సంక్షేమం, అవినీతి నిర్మూలన వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు వివరించారు. ఇందిరమ్మ 20 సూత్రాల కార్యక్రమంలోని ప్రధాన ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందని ఆడే గజేందర్ పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రేవంత్ రెడ్డి నాయకత్వంపై విశ్వాసంతో ఆడే గజేందర్ ప్రజాక్షేత్రంలో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేశాయి.

# నవంబర్ నెలాఖరులోగా వైద్య కళాశాల, తీగల వంతెన పనులు పూర్తి చేయాలి

## జిల్లాకలెక్టర్ దివాకర టీఎస్



**ఉద్యమ కెరటం, ఖమ్మం:** ఖమ్మం నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు, భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. శనివారం ఖమ్మం కాల్వొడ్డు వద్ద మున్నేరు నదిపై నిర్మిస్తున్న తీగల వంతెన పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రఘునాథపాలెం మండలంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్‌తో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను దశలవారీగా పూర్తి చేసేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. కళాశాల ప్రహరీ గోడ, హాస్టల్ భవనాలు, అంతర్గత రహదారులు, ఇతర మౌళిక సదుపాయాల పనులను సమాంతరంగా చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ప్రభుత్వ వైద్య కళాశాలను అందుబాటులోకి తీసుకువచ్చేలా అవసరమైన అన్ని వసతులు కల్పించాలని తెలిపారు. విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారుల పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముందుగా గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తుకు సంబంధించిన విద్యుత్ పనులను పూర్తి చేసి వినియోగానికి సిద్ధం చేయాలని, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌తోపాటు మిగిలిన నిర్మాణాలను నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. బాలికల హాస్టల్ నిర్మాణంలో మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. హాస్టల్‌లో అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించి, విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం ఏర్పాటుచేయాలన్నారు. మున్నేరు నదిపై నిర్మిస్తున్న తీగల వంతెన పనులను పరిశీలించారు. మిగిలిన పనులను వేగవంతం చేసి నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ నాణ్యత, భద్రత ప్రమాణాలను పాటిస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రఘునాథపాలెంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించి ప్రధాన భవనం, హాస్టల్ భవనాలు, వంటగది, భోజనశాల నిర్మాణాలను నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని, నీటి సరఫరా ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా అన్ని నిర్మాణాలను పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్, రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, వైద్యశాఖ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# కవితా గానంతో అలరించిన ఆసిఫాబాద్ కవి ధర్మపురి



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 'దర్పణం సాహిత్య వేదిక' ఆధ్వర్యంలో 65 మంది కవుల విభిన్న కవితల సమాహార పుస్తకావిష్కరణ మహోత్సవం శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖ కవి, ఉపాధ్యాయులు, దర్పాణం సాహితీ సమీక్షకులు ధర్మపురి వెంకటేశ్వర్లు విశిష్ట అతిథిగా పాల్గొని తన కవితా గానంతో సభికులను విశేషంగా అలరించారు. ఆయన వినిపించిన భావయుక్తమైన కవితలు సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం సాహితీ రంగానికి ఆయన అందిస్తున్న సేవలను కొనియాడుతూ ప్రముఖ కవి అమ్మంగి వేణుగోపాల్, దర్పాణం ప్రధాన కార్యదర్శి కవయిత్రి ఛీదెళ్ల సీతాలక్ష్మి, కవి సంగమం వ్యవస్థాపకులు కవి యాకుబ్‌లు ధర్మపురి వెంకటేశ్వర్లును శాలువాతో కప్పి, ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

# పూలనే దేవతగా పూజించే వేడుక "బతుకమ్మ పండుగ"





## జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.శారదాదేవి

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ప్రకృతిలో లభించే పూలను బతుకమ్మగా పేర్చి దేవతగా పూజించే తెలంగాణ సంస్కృతి వైభవోపేతమైనదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.శారదాదేవి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థాన భవన సముదాయం ఆవరణలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలలో జిల్లా కలెక్టర్ కె.హరిత, న్యాయమూర్తులు అనంతలక్ష్మి, అనూష, జిల్లా ఎస్.పి. నితికా పంత్, జిల్లా అటవీ అధికారి బాలమణిలతో కలిసి గౌరమ్మకు పూజలు నిర్వహించి, బతుకమ్మ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రకృతిలో లభించే పూలను బతకమ్మగా పేర్చి దేవతగా పూజింపబడే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించి, వాటిని పాటించేలా మన సంస్కృతిని కాపాడుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా రంగోలి, ఇతర పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు, బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
ఆదివారం
18 అక్టోబర్ 2026

# రీ-సర్వే పనుల వేగవంతానికి 6 జిఎన్ఎస్ఎస్ రోవర్ల పంపిణీ

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లాలో భూ రీ-సర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో మండల సర్వేయర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూ మంత్రి రీ-సర్వే పనులను వేగవంతం చేసేందుకు జిఎన్ఎస్ఎస్ రోవర్లను కొనుగోలు చేయాలని ఇచ్చిన ఆదేశాల మేరకు తక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు జిల్లాకు 6 జిఎన్ఎస్ఎస్ రోవర్లను కొనుగోలు చేసి, సంబంధిత మండల సర్వేయర్లకు పంపిణీ చేయడం జరిగిందని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఈ పరికరాలు భూ రీ-సర్వే ప్రక్రియలో కీలకంగా ఉపయోగపడనున్నాయని తెలిపారు. జిఎన్ఎస్ఎస్ రోవర్ల వినియోగం ద్వారా సంబంధిత గ్రామాలలో గ్రౌండ్ ట్రూతింగ్, భూముల క్షేత్రస్థాయి పరిశీలన, సర్వేకు సంబంధించిన ఇతర పనులను మరింత వేగవంతంగా, ఖచ్చితత్వంతో నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రీ-సర్వే పనులలో జాప్యాన్ని తగ్గించి, నిర్దేశించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు వీలవుతుందని తెలిపారు. జిల్లాలో రీ-సర్వే పనులను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సాంకేతిక పరికరాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, సంబంధిత అధికారులు, మండల సర్వేయర్లు సమన్వయంతో పని చేస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కారుణ్య నియామకం క్రింద ఆరుగురికి నియామక పత్రాలు

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** కారుణ్య నియామకం క్రింద జిల్లాలోని ప్రభుత్వ శాఖలలో ఆరుగురికి నియామక పత్రాలు అందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్ లతో కలిసి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలలో ఉద్యోగులుగా పనిచేసి వివిధ కారణాల వలన మరణించిన వారి స్థానములో వారి కుటుంబ సభ్యులలో ఒకరిని కారుణ్య నియామకం క్రింద నియమించడం జరిగిందని తెలిపారు. ముగ్గురిని వివిధ శాఖలలో జూనియర్ అసిస్టెంట్లుగా, మరో ముగ్గురిని వివిధ శాఖలలో కార్యాలయ సబార్డినేట్ లుగా నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఉప పాలన అధికారి జాస్టిన్ జోయల్, కలెక్టరేట్ పరిపాలన అధికారి కిరణ్ కుమార్, కారుణ్య నియామక అభ్యర్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ఎస్సై శ్రీకాంత్ సస్పెన్షన్!





- సిరిసిల్లలో భగ్గుమన్న నిరసనలు..
- అంబేద్కర్ చౌరస్తాలో బైఠాయింపు
- విలేకరులపై పోలీసుల దాడిని నిరసిస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆందోళన
- రోడ్డుపై బైఠాయించిన విశారదన్ మహారాజ్.. నిలిచిపోయిన ట్రాఫిక్
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి వినతిపత్రం
- విధుల్లో నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘన ఆరోపణలతో ఎస్సైపై వేటు

**ఉద్యమ కెరటం, సిరిసిల్ల, అక్టోబర్ 17:** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో జర్నలిస్టులపై ఎస్సై శ్రీకాంత్ థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపాయి. విలేకరులపై దాడికి పాల్పడిన పోలీసు అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు, ధర్మసమాజ్ పార్టీ అధినేత విశారదన్ మహారాజ్ శనివారం సిరిసిల్ల పట్టణంలో ఆందోళన చేపట్టారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు గంభీరావుపేట ఎస్సై సీహెచ్ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.



### అంబేద్కర్ చౌరస్తాలో ఉద్రిక్తత

గంభీరావుపేటలో విలేకరులపై దాడిని నిరసిస్తూ విశారదన్ మహారాజ్ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్న నిరసనకారులు రహదారిపై బైఠాయించి పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం తీవ్రమైన అంశమని, బాధ్యులను ఉపేక్షించరాదని డిమాండ్ చేశారు. నిరసనల కారణంగా వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో చౌరస్తా పరిసరాల్లో ట్రాఫిక్ స్తంభించింది.

### ఎస్పీకి వినతిపత్రం అందజేత

విలేకరులపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని విశారదన్ మహారాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులపై జరిగిన ఘటనను సమగ్రంగా విచారించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగేలా ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

### ఎస్సై శ్రీకాంత్‌పై సస్పెన్షన్ వేటు

ఈ పరిణామాల నేపథ్యంలో గంభీరావుపేట పోలీస్ స్టేషన్ ఎస్సై సీహెచ్



శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్–1 ఐజీ, జోన్–3 రాజన్న డీఐజీ ఇన్‌చార్జ్ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో తీవ్రమైన నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘనతోపాటు అదుపులోకి తీసుకున్న వ్యక్తులపై భౌతిక దాడికి పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్ దాటరాదు

ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లా సాయుధ రిజర్వు ప్రధాన కార్యాలయానికి అనుసంధానంగా ఉన్న ఎస్సై శ్రీకాంత్ సస్పెన్షన్ కాలంలో ప్రధాన కార్యాలయాన్ని విడిచి వెళ్లరాదని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఎక్కడికైనా వెళ్లాల్సి వస్తే ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. జర్నలిస్టులపై దాడి ఆరోపణల నేపథ్యంలో ఎస్సైపై సస్పెన్షన్ వేటు పడటం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అయితే ఆరోపణలపై తదుపరి విచారణలో పూర్తి వివరాలు తేలాల్సి ఉంది.

# దసరా వేళ.. ఆలయ శుభ్రత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** దసరా ఉత్సవాలను పురస్కరించుకుని కేస్లాపూర్ హనుమాన్ ఆలయ పరిసరాలలో బూరుగూడ సర్పంచ్ మేకర్తి సంగీత లచ్చన్న ఆధ్వర్యంలో గురువారం ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో, రాకపోకల మార్గంలో పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను పంచాయతీ సిబ్బందితో దగ్గరుండి తొలగించి ప్రాంగణాన్ని శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందుజాగ్రత్త చర్యగా ఈ పారిశుధ్య కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. భక్తులందరూ పరిశుభ్రమైన వాతావరణంలో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను జరుపుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో దసరా ఉత్సవ సమితి ప్రతినిధులు ధర్మపురి వెంకటేశ్వర్లు , శిరీష్ శర్మ, అడప సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి

**ఉద్యమ కెరటం, కుత్బుల్లాపూర్ ప్రతినిధి:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి శనివారం నిజాంపేట్ పరిధిలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, సిరి సంపదలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని శ్రీ కనకదుర్గ అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ ధర్మకర్త కొలన్ తేజ శ్రీనివాస్ రెడ్డి, కొలన్ నర్సింహా రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డీసీసీ సభ్యులు రావూరి మౌళేశ్వర్ రావు, డివిజన్ అధ్యక్షులు వారాగాని వాసు, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, నాయకులు టేకుల ప్రవీణ్ రెడ్డి, శ్రీశైలం, లక్ష్మణ్, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పలు ఆలయాల్లో బండి రమేష్ ప్రత్యేక పూజలు



**ఉద్యమ కెరటం, కూకట్‌పల్లి, :** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ శనివారం పలు ఆలయాల్లో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖైతలాపూర్‌లోని దుర్గమ్మ తల్లి ఆలయంలో ప్రకాష్ ముదిరాజ్ ఆహ్వానం మేరకు, చిత్తరామ టెంపుల్‌లో తూము వేణు ఆహ్వానం మేరకు, బేగంపేట్‌లో రమేష్ ఆహ్వానం మేరకు నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలకు బండి రమేష్ హాజరయ్యారు. ఆయా ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, సమాజంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## అల్విన్ కాలనీ ఫేస్-2లో ఘనంగా దేవి నవరాత్రి వేడుకలు

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్



**ఉద్యమ కెరటం,కూకట్‌పల్లి ప్రతినిధి:** అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఫేస్-2లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం కాలనీ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవి మండపాన్ని డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని అందజేశారు. దేవి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను ఈ సందర్భంగా వారు అభినందించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, భాస్కర్ రెడ్డి, కృష్ణారావు, కట్టా శ్రీనివాస్, అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.